సంపుటం 18 సంచిక 164

రిజిస్టరు నెం. H 45 స్థాపితం 1925

గోలకొండపత్రిక

హైదరాబాదు 15—7—1960 శనివారము

సంపాదకుడు: ఎన్. నరోత్తమరెడ్డి ఎం. ఎ

4 పేజీలు 7 నయాపైసలు

101181.

కాంగ్రెస్ వాదుల అవినీతినేరాల విచారణ

కొత్తఢిల్లీ, జులై 15

కాంగ్రెస్ కార్యవర్గం గడచిననెల పూనాలో తీసుకున్న నిర్ణయాన్ని అనుసరించి ఉన్నతపదవుల్లోగల కాంగ్రెస్ వాదులపై చేయబడే అవినీతి ఆరోపణల విచారణకు ఆరుగురుప్రముఖులతో కూడిన ఒక పేనల్‌ను తాము నెలకొల్పుచేసినట్లు కాంగ్రెస్ అధ్యక్షులు ఎన్. సంజీవరెడ్డి తెలిపారు.

రెండు మూడురోజుల తర్వాత ఈ పేనల్‌లోని సభ్యుల పేర్లు తాము వెల్లడిచేయగలమన్నారు. దీనిలో ఉండటానికి ఇష్టపడి అంగీకరించేది లేనిదీ వారి సమాధానంకొరకు ఎదురు చూస్తున్నామన్నారు.

రెండు రోజుల గొప్పవేలం

ఛాదర్‌ఘాట్ వంతెన సమీపమున స్విట్ అబ్బాస్ వద్ద 1960 జూలై 17, 18 తేదీలు ఆది, సోమ వారములలో ఉదయం 11 గంటలకు వేలం జరుగును. లెఫ్టినెంట్ కర్నల్ తారాపూర్ మరియు ప్రముఖులనుండి సేకరించబడినట్టి అందమైన వస్తువులు హైక్లాస్ ఫర్నిచర్, అలంకరణ వస్తువులు, ఆభరణములు గలవు.

బద్రి విశాల్,
గవర్నమెంట్ అండ్ పబ్లిక్ ఆక్షనీర్స్,
సుల్తాన్‌బజార్, హైద్రాబాద్.

కేంద్ర ఉద్యోగుల సమ్మె విరమణకై రాజీ బేరాల వైఫల్యం

రోజురోజుకూ విఫలమైపోతున్న సమ్మె పరిస్థితి

న్యూఢిల్లీ, జులై 15

దేశంలో సమ్మె పరిస్థితి నేడు మరింత మెరుగైంది. అనేక ప్రాంతాలలో అరెస్టులు జరిగినవి. మొదటిసారిగా బెంగుళూరులో ముగ్గురికి మూడేసిమాసాల కఠినశిక్షను మొదటితరగతి మేజిస్ట్రేట్ విధించారు. మొదటిసారిగా ఉత్తరప్రదేశ్‌లో ఒకస్త్రీ అరెస్టుచేయబడింది. చాలచోట్ల విమాన, తంతి, తపాలా, రైళ్ళ రాకపోకలు మామూలుగా సాగిపోతున్నవి సమ్మె పరిష్కారానికి శ్రీ అశోక మెహతా రేపే న్యూఢిల్లీ వస్తున్నారు.

తొలిసారిగా స్త్రీ అరెస్టు

లక్నో, జూలై 15: నిన్న తొలిసారిగా ఒక స్త్రీని అరెస్టు చేశారు. రైల్వే పాఠశాల ఉపాధ్యాయిని భార్య అయిన శ్రీమతి భట్నాగర్ సమ్మెకు అనుకూలముగా ఒక స్త్రీల సభ జరుపబోగా యీఅరెస్టు జరిగింది.

మద్రాసులో అరెస్టులు

కేంద్ర సిబ్బంది సమ్మె సందర్భంగా మద్రాసులో మొత్తం 708 గురు అరెస్టు చేయబడినారు.

బొంబాయిలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలలోని పరిస్థితి నేడు మరింత మెరుగైనది. సుమారు 500 మంది శాశ్వతోద్యోగుల్ని బర్తరఫ్ చేస్తూ 175 మంది శాశ్వతఉద్యోగుల్ని సస్పెండ్ చేస్తూ నగరంలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు నోటీసులు జారీ చేసినవి.

సమ్మెను బేషరతుగా విరమించాలి

శ్రీవాసవద అభ్యర్థన

అహ్మదాబాద్, జూలై 15: కార్మికోద్యమ ప్రయోజనాల దృష్ట్యా సమ్మెను బేషరతుగా విరమించుకోవడం మంచిదేమో పరిశీలించుమనిఅఖిల భారత రైల్వే ఉద్యోగుల ఫెడరేషన్ అధ్యక్షుడు శ్రీ ఎస్. గురుస్వామి కి భారత రైల్వేమెన్ జాతీయ ఫెడరేషన్ అధ్యక్షుడు శ్రీ ఎస్. ఆర్. వాసవద వ్రాశారు. ఈ సమ్మెవలన సమ్మెదార్లకే గాక కార్మికోద్యమానికి తీరని నష్టం సంభవిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. దీనివలన చాల కాలం పర్యటన నుండి తిరిగివచ్చింది మొదలు ప్రభుత్వం, వారి ఉద్యోగుల మధ్యగల విభేదాల్ని తగ్గించి సుహృద్భావాన్ని తిరిగి నెలకొల్పడానికే శక్తికొలదీ ప్రయత్నిస్తున్నానన్నారు.

సస్తుత ఉద్రిక్త వాతావరణ లో ఉభయుల విశ్వాసాన్ని పొందడం చాల కష్టమన్నారు. కొందరుప్రజాసోషలిస్టు ప్రముఖులు సమ్మెలో ముఖ్యపాత్ర వహించారంటే కార్మికనాయకులుగా వారలా చేశారు.

వేలాది ప్రభుత్వోద్యోగుల్ని, కార్మిక నాయకుల్ని అరెస్టుచేసినందుకు శ్రీ మెహతా ప్రభుత్వాన్ని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తన ఉద్యోగులతో సామరస్య సాధనకు ముందుగా పూనుకొని స్నేహహస్తాన్ని ప్రదర్శించాలన్నారు.

పాటు గ్రామికప్రజల ప్రయోజనాలు దెబ్బతినగలవని వివరించారు.

కేంద్ర ప్రభుత్వ పరిశీలన

కేంద్ర మంత్రివర్గ కార్యదర్శి శ్రీ విష్ణుసహాయ్ సమ్మె పరిస్థితి చాల మెరుగైనదని కేంద్ర అధికారుల సమీక్ష అనంతరం పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వోద్యోగుల సమ్మెను విరమింపజేసే సంకల్పంతో కేంద్ర మంత్రులు వారంతటవారు చర్చించుకొనే ఏర్పాటును యిక్కడికి వచ్చిన శ్రీ గురుస్వామి ప్రభృతి కార్మిక నాయకులు కల్గించారు.

శ్రీ అశోక్ మెహతా

బొంబాయి, జూలై 15: భారత ప్రజాసోషలిస్టుపార్టీ అధ్యక్షుడు శ్రీ అశోక మెహతా రేపు ఢిల్లీకి బయలుదేరి వెడుతున్నారు. ఆయన ఒక ప్రకటనలో తాను జూలై 11 న విదేశ



గవర్నర్ శ్రీభీమసేన సచార్ 14వ తేదీన ఆంధ్రప్రదేశ్ సంస్కృతి సంవర్ధక సమితి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రారంభోత్సవం చేశారు. ఇందు ముఖ్యమంత్రి మరికొందరు ఇతర మంత్రులు నంబూరి శ్రీనివాసరావు ఎం. ఎల్. ఎ. కలరు.

ప్రణాళిక ప్రచార వారోత్సవ సందర్భంగా ఏర్పరచబడిన ప్రదర్శనను గవర్నర్ సచార్ తిలకించారు.

శ్రీ కొండా వెంకట రంగారెడ్డిపట్టాభిషేకోత్సవసభ

హైద్రాబాద్, జులై 15

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ కె. వి. రంగారెడ్డిగారి పట్టాభిషేకోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌నగర సంస్థలు 18 17వ తేదీ సాయంత్రం 6 గంటలకు రామ్‌కోట్‌లోనిసరోజినీదేవిహాలులో మాజీమంత్రి శ్రీ పి. తిమ్మారెడ్డి అధ్యక్షతన సన్మాన సభను జరుపుతాయి.

కౌలు భూములను, కౌలునుక్రమపరచేబిల్లు

శాసన సభలో ఉప ముఖ్యమంత్రి ప్రతిపాదన

హైద్రాబాదు, జులై 15

కౌలుకు తీసుకొనే భూమి గరిష్ఠ పరిమితి, భూస్వామికి కౌలుదారు ఇచ్చే కౌలు, భూమిని కౌలుకు ఇచ్చే కాల పరిమితి మున్నగు అంశాల క్రమపరచేందుకై రాష్ట్ర శాసనసభలో ఉప ముఖ్యమంత్రి శ్రీ కె. వి. రంగారెడ్డి ఒక బిల్లును ప్రతిపాదించారు. ఇది జాయింట్ సెలెక్టు కమిటికి నివేదించబడగలదు.

ఈ బిల్లును ప్రతిపాదిస్తూ ఆంధ్ర తెలంగాణాలలో ఏకరీతి కౌలుదారీ శాసనాన్ని తెచ్చేందుకు ఇది ఉద్దేశింపబడినదని వివరించారు,

దీనిని అనుసరించి ఏ కవులుదారు గూడా కొన్నాళ్లక్రితం రాష్ట్ర శాసన సభ ఆమోదించిన వ్యవసాయ భూముల గరిష్ఠ పరిమితి బిల్లులో సూచింపబడిన కమతంకన్నా భూమిని కలిగి ఉండవీలులేదు, (భూసారాన్ని బట్టి కుటుంబకమతం 6 ఎకరాలనుండి 72 ఎకరాల వరకు ఉండవచ్చునని దీనికి నాలుగున్నరరెట్లు గరిష్ఠ భూవసతి అని ఈ బిల్లు నిర్ణయిస్తున్నది) చెల్లించవలసిన కౌలు గరిష్ఠ పరిమితి నీటి సౌకర్యంగల భూములయినచో పండే సగటుపంటలో 25 శాతం నీటి సౌకర్యం లేనివైనచో పండే సగటు పంటలో 20 శాతం, కౌలు కాలం ఆరు సంవత్సరాలకన్నా ఎక్కువ ఉండరాదు. ప్రతి ఆరేండ్లకు తిరిగి కౌలుకు ఇవ్వవచ్చును. లేక భూస్వామి స్వంత సేద్యం క్రిందికి తీసుకోవచ్చును.

ప్రస్తుతం తెలంగాణాలో అమలులోగల హైద్రాబాదు కౌలుదారీ వ్యవసాయ భూముల బిల్లులోని ముఖ్యాంశాలు దీనిలో ఉన్నాయని రక్షిత కౌలుదార్లకు తగు రక్షణలు కలిపింపబడినవని ఉప ముఖ్యమంత్రి సూచించారు.

ఈ బిల్లుపై జరిగిన చర్చలో కె. ఎల్. నరసింహారావు (కమ్యూ) పూర్వపు హైద్రాబాదు చట్టం కౌలుదార్లకు ఇస్తున్న హక్కులను ప్రయోజనాలను ఈ బిల్లు హరివర్తిస్తున్నదని దీనిలో ప్రతిపాదింపబడిన కౌలుగూడ అధికంగానే ఉన్నదని హైద్రాబాదు చట్టంలో భూమి శిస్తు ప్రాతిపదికపై కౌలు ఉంటే ఇది పంటపంటను బట్టి కౌలును ప్రతిపాదిస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ సభ్యులు ఎల్ లక్ష్మణదాస్ జి. నరసింహమూర్తి ఈబిల్లులో చూపబడిన కౌలురేట్లు చాలా తక్కువగా ఉన్నవని అందువల్ల ఇప్పుడు కవులుకు ఇస్తున్నవారు తమ భూముల స్వంత సేద్యానికి కవులుదార్లనుండి తీసుకునే ప్రమాదం కలదన్నారు.

హైదరాబాదుచట్టం కౌలుదార్లకు ఇస్తున్న హక్కుల ఈబిల్లు హరించివేస్తున్నదని శ్రీ బి. కేశవరెడ్డి (కాం) అన్నారు,

పి. రాజగోపాల నాయుడు (స్వ) కె. పున్నయ్య (కాం) ఎస్. వి కె. ప్రసాద్ బి. శంకరయ్య (కమ్యూ) ఎ బి. నాగేశ్వరరావు (ప్రజాపార్టీ) జి. గంగారెడ్డి (కాం) మరో తొమ్మిది మంది చర్చలో పాల్గొన్నారు.

ప్రభుత్వోద్యోగుల వేతనాలు కొంత ధాన్యరూపంలో యివ్వాలి

ధరల్ని తగ్గించడానికిదే మార్గమనీ, వేతనాల్ని పెంచి లాభంలేదనీ ఆచార్య వినోబా భావే

ఇందోర్, జులై 15

మధ్య తరగతి ప్రభుత్వోద్యోగుల వేతనాలు సగము ధాన్యరూపములోనూ, సగము సగదు రూపేణా ఇవ్వబడాలని భూదాన నాయకుడు ఆచార్య వినోబా భావే ఇచ్చట తనఅభిప్రాయాన్ని తెల్పారు. ఇచ్చటికి ఉత్తరంగా 150 మైళ్ళలో ఉన్న సోయట్‌లో తాను రెండవసారి మధ్యప్రదేశ్ చేరిన తరువాత జరిగిన మొదటి ప్రార్థనా సమావేశములో ప్రసంగిస్తూ కేంద్రసిబ్బందిసమ్మెప్రసక్తిరాగా వారివేతనాలను పెంచినంత మాత్రాన వారికేలాంటి ప్రయోజనం చేకూరబోదంటూ పైఅభిప్రాయాన్ని ఆయన వ్యక్తపరిచారు.

ఐదుగురు సభ్యులున్న కుటుంబమునగల ప్రతి ప్రభుత్వోద్యోగికి ప్రతినెల 2 మళ్ళ ఆహారధాన్యాలను ఇవ్వగా మిగిలిన వేతనాన్ని డబ్బురూపములో యివ్వాలని అన్నారు. భూమి శిస్తును ధాన్యరూపంలో సేకరించి తగు నిలవలను పోగుచేసి తద్వారా సిబ్బందికి ఆహారధాన్యాలను సరఫరాచేయాలని ప్రభుత్వానికి ఆయన సలహానిచ్చారు. ఈ విధానాన్ని అనుసరించుట వలన ఆహారధాన్యాల ధరల పెరుగుదలను అరికట్టవచ్చునని ఆయన అన్నారు.

జంట నగరాలలో నిషేధాజ్ఞలు

హైద్రాబాద్, జులై 15

కేంద్ర ప్రభుత్వోద్యోగుల సమ్మె దృష్ట్యా, శాంతి, భద్రతలకు భంగం వాటిల్లే అవకాశంవున్నందువల్ల, హైదరాబాదు, సికింద్రాబాదు జంటనగరాల మునిసిపల్ హద్దులలో, అయిదుగురు లేక అంతకంటే ఎక్కువమంది వ్యక్తులు సమావేశం కావడాన్ని లేదా ఊరేగింపు తీయడాన్ని నిషేధిస్తూ, హైద్రాబాదు, సికింద్రాబాదునగరాల పోలీసు కమీషనరు ఉత్తర్వులుచేశారు. ఈఉత్తర్వు 1960 జులై 15 వతేదీ అర్ధరాత్రిలగాయతు జులై 16వ తేదీ నడిరేయివరకు అమల్లో వుంటుంది. అసిస్టెంటుపోలీసు కమీషనరు అనుమతితో జరుగునభలకు, ఊరేగింపులకు ఈ ఉత్తర్వు వర్తించదు.

డ్యూటీలోవున్న పోలీసు, సైనిక ఉద్యోగులకూ, ప్రభుత్వకార్యాలకూ. అంత్య సంస్కారానికై శవాన్ని తీసుకుపోయేవాటికి కూడా ఇదివర్తించదు.

"ఆముదాలు-వాటి వివిధోత్పత్తులు"పై గోష్ఠి

హైద్రాబాద్, జులై 15

"ఆముదాలు - వాటి వివిధోత్పత్తులు" అను విషయంపైన హైద్రాబాద్ రీజినల్ రిసర్చ్ లేబలేటరీవారు ఆగస్టు 11,12 తేదీలలో ఒక గోష్ఠిని ఏర్పరచారు ఇందులో ప్రముఖ పరిశోధకులు, సాంకేతిక ప్రవీణులు, పారిశ్రామికులు, ప్రభుత్వాధికారులు పాల్గొనెదరు.

నిర్నిబద్ధంగా విరమించండని సలహా

కొత్తఢిల్లీ, జులై 15

కేంద్ర ప్రభుత్వోద్యోగుల సమ్మెను నడుపుతున్న కొందరు నాయకులు ఈసమ్మెవిరమణకై చేసిన రాజీ ప్రతిపాదనల భారత ప్రభుత్వం అంగీకరించలేదని ఒక ఉన్నతాధికారి తెలిపారు. "సమ్మె విరమణకై సంప్రదింపుల జరిపే సమస్యేలేదని" ఈతను స్పష్టీకరించాడు.

సమ్మె చేస్తున్నవారిపై చర్య తీసుకొనమని హామీ ఇస్తూ, ఈ సమ్మె ముందుగా శ్రీ ఫెరోజ్‌గాంధి జరిపిన రాయబారాలలో ప్రభుత్వం అంగీకరించిన అంశాలకు కట్టుబడి ఉంటే తాము సమ్మెను ఉపసంహరించుకొనగలమని సమ్మెనాయకులు ప్రభుత్వానికి తెలిపారట.

కేంద్ర చర్యాసమితి సభ్యుడు అఖిలభారత రైల్వే పనివారల ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీ గురుస్వామి మరికొందరు కేంద్ర మంత్రుల కలువగా మొదట సమ్మెను నిర్నిబద్ధంగా ఎట్టి హామీలు షరతులు లేకుండా ఉపసంహరించుకోవాలని స్పష్టం చేయబడినదని తెలుస్తున్నది. ఈ మధ్యవర్తులకు మంత్రుల కలిసే కన్నా రైళ్లలో గల సమ్మెనాయకుల కలువాల్సినదిగా సలహా ఇవ్వబడినదట.

ఎస్. గురుస్వామి రైల్వేమంత్రి జగజీవన్‌రామ్‌ను ఈ ఉదయం కలిశాడు. కేంద్ర కార్మికమంత్రిని కలుద్దామని ప్రయత్నించిన వీలు చిక్కలేదు. ఫోన్‌ద్వారా గురుస్వామికి ప్రస్తుతం సమ్మె పరిస్థితిని చర్చించి లాభంలేదన్నారట. రైళ్ళలో ఉన్న సమ్మె నాయకుల కలువడానికి కొందరు పి అండ్ టి యూనియన్‌ల కార్యకర్తలు ప్రయత్నించగా వారికి ఇంకా అనుమతి దొరకలేదట.

రాజకీయరంగస్థలంపై నటన

హైద్రాబాద్, జులై 15

"నేను భర్తగా తాను భార్యగా నటిస్తూ వేషాలు వేశామని శ్రీ నంబూరిచెప్పారు. అవి రైళ్ళలో నాల్గు గోడల మధ్య 10 మంది ప్రేక్షకుల సమక్షంలోనే వేసిన వేషాలు. అంతకు మించి నాకు నాటకానుభవం లేదు. అయితే నటించడంలో నాకు ప్రజ్ఞ ఉందని శ్రీ నంబూరి శ్రీనివాసరావు చెప్పిన దానికి అర్థమైతే అందుకూఒప్పుకొంటాను. రాజకీయ రంగంలో నటన చాలఅవసరం" అని పబ్లిక్ వర్క్సు మంత్రి శ్రీ అల్లూరిసత్యనారాయణ రాజు నిన్న సాయంత్రం ఆంధ్ర ప్రదేశ్ సంస్కృతి సంవర్ధకసమితికి అధ్యక్షత వహిస్తూ అన్నారు.

"రంగస్థల నటనలో నటులలోపాల్ని కప్పిపుచ్చడానికి సంగీత వాద్యాలు, మేకప్ మున్నగునవి ఎన్నో ఉంటాయి రాజకీయ నటనలో అవేమీ ఉండవు. శోకరసాన్నీ వీరరసాన్నీ — అన్ని రసాలనూ మేమే స్వయంగా చూపించవలసి వస్తుంటుంది: వేలాది ప్రజలకళ్లు ఎప్పుడూ మా మీద ఉంటాయి. అందువలన ఏపరిస్థితుల్లో ఎలా నటించిగట్టెక్కాలో చూసుకొంటూ మేము ఎల్లప్పుడూ జాగరూకతతో ఉండాలి. మా నటనా కౌశలంలో ఎక్కడయినా తప్పుటడుగువేస్తే మాగతి ఏమౌతుందో మీ అందరికీ తెలుసు" అని శ్రీ అల్లూరి చమత్కరించారు.

బి. అండ్ సి. మిల్సు కార్మికుల సమ్మె

మద్రాస్, జులై 15

మద్రాస్‌లోని బి. అండ్ సి. మిల్సు కార్మికులు నేడు సమ్మెచేశారు. తొలి షిఫ్టులోని 8 వేల కార్మికులు నేడు పనికి హాజరు కాలేదు.

పరిస్థితులు కుదుట పడుతున్నాయి

రాష్ట్రంలో 779 మంది అరెస్టు

హైద్రాబాదు, జులై 15

కేంద్రప్రభుత్వ ఉద్యోగుల సమ్మె ప్రారంభమైన నాల్గవదినానాడు చాలా అభివృద్ధి కాన్పించినది. శ్రీకాకుళం తూర్పు గోదావరి జిల్లాలందు పరిస్థితి మెరుగయినది. ఈప్రాంతాలందు పోస్టుటెలిగ్రాఫ్ ఆర్.ఎమ్.ఎస్. ఉద్యోగులు సమ్మె విరమించారు.

గుంటూరులో పి అండ్ టికి చెందిన నల్గురే సమ్మెచేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని పాలకొల్లువద్ద టెలిఫోన్ ఉద్యోగులు సమ్మెవిరమించి డ్యూటీలో చేరారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈసమ్మె సందర్భంగాఅరెస్టుచేయబడిన వారి మొత్తం సంఖ్య 779.

సికింద్రాబాదులోని జేమ్సుస్ట్రీట్ వద్దగల సికింద్రాబాద్ చాందాట్రంక్ లైన్ డిస్ట్రిబ్యూషన్ నేడు చెడగొట్టబడి కాన్పించినది. దీనినికనుగొని అధికారులు బాగుచేశారు. ఇది విధ్వంసకర చర్యగా తలచబడుతున్నది.

16 వ తేదీన హైద్రాబాద్ మజ్దూర్ సంఘము కేంద్ర ప్రభుత్వోద్యోగుల సమ్మెకు సానుభూతిపూర్వకంగాజరుపదలచిన 8 గంటల సానుభూతి సమ్మె అనిర్ణీతంగా వాయిదావేయబడినదని దీని కార్యదర్శి గోవిందాచారి తెలుపుతున్నారు.

గత రాత్రి పోలీసులు నేషనల్ రైల్వే మజ్దూర్ సంఘం కార్యాలయముపై దాడిచేసి లాలాగూడావర్క్‌షాపుకు చెందిన 88 మంది సమ్మెదారుల తమ కస్టడీలోనికి తీసుకున్నారని యూనియన్ కార్యాలయము విడుదలచేసిన ప్రకటనతెలుపుతున్నది. దాదాపు 80 మంది వర్క్‌షాపు ఉద్యోగులు యూనియన్ ఆఫీసులో నిద్రపోతూ ఉండిరట.

సికింద్రాబాద్‌లో జరిగిన సాధారణ సమ్మెలో నిన్న విద్యార్థులుకూడ పాల్గొనడంతో పరిస్థితిలో కొత్తదనం కనబడింది. ముగ్గురు విద్యార్థుల్ని పోలీసులు అరెస్టు చేశారు.

మేయర్లవిజ్ఞప్తిపై సహాయానికి సంసిద్ధం

హైద్రాబాద్, సికింద్రాబాద్ నగరాల మేయర్లవిజ్ఞప్తిపై ఆంధ్రప్రదేశ్ వ్యాపార సమితి, హిందీ విద్యాలయం, రోటరీ క్లబ్, వాణిజ్య మండలి, కలప వర్తకుల సంఘం, హైద్రాబాద్ వాణిజ్య కళాశాల మున్నగు సంస్థలు అవసర సర్వీసుల నిర్వహణలో ప్రభుత్వానికి సహాయపడగలమని తెలియజేసినవి.

ఇవిగాక 317 గురువ్యక్తులు తాము ఏ హోదాలోనైనా ప్రభుత్వానికి సహాయం చేయగలమని హైద్రాబాద్ మునిసిపల్ కార్పొరేషన్‌కు తెలియజేశారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివివరణ

హైద్రాబాద్, జులై 15: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీదామోదరం సంజీవయ్య నేడు సమ్మె పరిస్థితిని పరిశీలించిన మంత్రివర్గ ఉపసంఘ సమావేశానంతరం విలేఖరులతో ముచ్చటిస్తూ సికింద్రాబాదు, కాజీపేట, విశాఖపట్నాలలో మినహా రాష్ట్రమంతటా మామూలు పరిస్థితి తిరిగి నెలకొన్నదన్నారు.

సమ్మె చేస్తున్న కేంద్ర సిబ్బంది 9 జిల్లాలలో పనిలోకి వచ్చారు. మిగిలిన 11 జిల్లాలలో కూడ సమ్మెదారులు క్రమేణా పనిలోకి వస్తున్నారు.

ఉపముఖ్య మంత్రి శ్రీ కె.వి. రంగారెడ్డి, ప్లానింగ్ మంత్రి శ్రీ పి.రంగారెడ్డి, హోంమంత్రి శ్రీ మందుముల నరసింగరావు, ఆరోగ్యమంత్రి శ్రీ పి. వి. జి. రాజుగారు ప్రధానకార్యదర్శి పాయ్, సెంట్రల్ రైల్వే డివిజనల్ సూపరింటెండెంట్, శ్రీరథ్ హైదరి ఐ.జి.పి. నంబియార్, పోలీసు కమీషనర్ కళ్యాణరావు, సమాచార శాఖ డైరెక్టర్ నరేంద్రలూథర్, హైద్రాబాద్ మేయర్ రోషన్ అలీఖాన్, సికింద్రాబాద్ మేయర్ ఎస్. సత్యనారాయణగుప్త, హైద్రాబాద్ కార్పొరేషన్ కమిషనర్ సి.ఎన్ శాస్త్రి ప్రభృతులుకూడ అసెంబ్లీ చాంబర్‌లో జరిగిన యీసమావేశానికి హాజరైనారు.

ఆంధ్రప్రదేశ్‌లో సమ్మె పరిస్థితి

ఆంధ్ర ప్రదేశ్‌లో తంతి తపాలా శాఖలో 40 శాతానికితక్కువ, రైల్వేలలో 25 శాతానికి తక్కువ మంది ఉద్యోగులే సమ్మె చేస్తున్నట్లు ప్రభుత్వానికి సమాచారం అందిందని ముఖ్య మంత్రి అన్నారు.

రైల్వేలు మామూలుగా పనిచేస్తున్నవి. రైళ్ళు యథాప్రకారం నడుస్తున్నవి. లాలాగూడ, కాజీపేటలలోని వర్క్‌షాపులలో సమ్మె కొనసాగుతున్నది. అయితే ప్రాంతీయసైన్యము, సమ్మెలో పాల్గొనని ఉద్యోగుల సహాయంతో పని సాగుతున్నది.

తంతి తపాలాశాఖలో అన్ని పనులూ రాష్ట్రమంతటా జరుగుతున్నవి. రిజిష్టర్డు ఉత్తరాలు, మనియార్డర్‌లు బట్వాడా మాత్రమే జరగడంలేదు.

ప్రజా సహకారం

అత్యవసర సర్వీసుల నిర్వహణకు ప్రజా సహకారం మిక్కుటంగా వస్తున్నదని ముఖ్యమంత్రి అన్నారు. ఇంతవరకూ వలంటీర్లను పూర్తిగా వినియోగించుకోలేదు. వినియోగించాలని సంకల్పించబడింది.

ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి చురుకుగా పనిచేస్తున్నది.

హింసాపూర్వక చర్యలు కొలదిగా మాత్రమే జరిగినవనీ, వాటికి యేమీ ప్రాధాన్యము లేదనీ ముఖ్యమంత్రి అన్నారు.

చాల ఆలోచించే ప్రభుత్వం అరెస్టులు చేస్తున్నదని ముఖ్యమంత్రి అన్నారు. ఆర్డినెన్సుక్రింద సమ్మెచేసిన వారందరినీఅరెస్టుచేయవచ్చు. అయితే చట్టాన్ని ఉల్లంఘించిన వారినే నిర్బంధంలోకి తీసుకొంటున్నారు. చాల మంది కార్మికులకు ఆర్డినెన్సు వివరాలు తెలియవు. అరెస్టయిన సమ్మెదార్లు కొందరు విచారం వ్యక్తపరిచి డ్యూటీలో చేరారు

పోలీసులు కాల్పులు సాగిస్తున్నారనీ, సమ్మెదార్ల కుటుంబాలలోని స్త్రీలపై దౌర్జన్యాలు చేస్తున్నారనీ వ్యాపిస్తున్న పదంతుల్ని ఖండించారు.

రైల్వేలలో పరిస్థితి

ఆంధ్రప్రదేశ్‌లో రైల్వేలలో లోకోషెడ్డులతోనూ, స్టేషనులలోనూ గూడ్సుషెడ్డులలోనూ ఇదివరకుసమ్మె చేసినవారిగూడ్స్ షెడ్డులో చాలామంది పనివారు యీవాళ అంటే సమ్మె వాల్గవ రోజున పనిలోకి వస్తున్నారు. సికింద్రాబాద్ డివిజన్‌లో పనిచేస్తున్న మొత్తం 27 వేల మంది కార్మికులలోనూ 28,810 మంది యీవాళ పనిలోకి వచ్చారు. కాజీపేట లోకోషెడ్డులోనూ, సికింద్రాబాద్ స్టేషన్‌లోనూ ఇంచుమించు సమ్మె చేసిన వారందరూ యీవాళ పనిలోచేరారు. కాజీపేట లోకోషెడ్డులో పనిచేస్తున్న 847 మందిలోనూ 950 మంది పనివారు యీనాళ పగటి షిఫ్టు హాజరయ్యారు. పూర్ణా లోకోషెడ్డులో కూడా మెరుగుదల కనిపిస్తోంది.

సమ్మెలో పాల్గొన్న శాశ్వతిక సిబ్బందిని పాలకసంస్థలు ఉద్యోగంలోంచి తొలగిస్తూ నోటీసులు జారీ చేశాయి. అత్యవసర సర్వీసుల నిర్వహణ ఆర్డినెన్సు క్రింద శిక్షపడిన వారిని తక్షణం ఉద్యోగంలోంచి డిస్మిస్ చేస్తున్నారు.

ప్రయాణీకుల రైలుబళ్ళు మామూలుగా నడుస్తున్నాయి. గూడ్స్‌బళ్ళ ద్వారా అత్యవసర సరుకుల రవాణా నిరాఘాటంగా సాగిపోతోంది.

(చివర పేజి చూడుడు.)

పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయము

ఆంధ్ర సర్కిల్, హైద్రాబాదు

నోటీసు

ఇందు మూలముగా ఆంధ్ర సర్కిల్ తపాలా కార్యాలయములన్నిటిలోను పనిచేయు శాశ్వతిక సిబ్బందిగా ఉండి సమ్మెలో పాల్గొనిన వారలను 1949 నియమముల ననుసరించి డి. సి. ఎస్. రూలు 5 (పి. ఎస్.) సర్వీసుల నుంచి తొలగించడమైనదని తెలియచేయబడుతున్నది. సమ్మెలో ఉండుటవలన నోటీసులను ఒక్కొక్కరికి వారివారి ఇంటి అడ్రసులకు పంపుటకు సాధ్యము కాదు. కనుక ఈ ప్రకటననే వారు వ్యక్తిగతమైన నోటీసుగా భావించవలెను.

ఈ సిబ్బందిలో సమ్మెలో పాల్గొన్న పర్మినెంట్ కానున్న వారు పర్మినెంట్ సర్వీసులో ఉన్నవారు 1960 జూలై 12 వ తేదీ నుంచి సస్పెన్షన్‌లో ఉంచినట్లు ఇందుమూలమున తెలియజేయబడుతున్నది.

డ్యూటీలో ప్రవేశించని వారిని సస్పెండు చేయుటలో ఏ మాత్రము సందేహములేదు. అటువంటి వారిపై క్రమశిక్షణ రాహిత్య చర్యగా వారివారి ఇంటిఅడ్రసులకు సస్పెన్షన్ మెమొరాండమును పంపనైనది.

ఈ సర్కిల్‌లో పనిచేయు ఉద్యోగులకు సస్పెన్షన్‌లో ఉన్న వారందరికై ఈ నోటీసు ఉద్దేశింపబడినది.

పోస్టు మాస్టర్ జనరల్

ఆంధ్ర ప్రదేశ్ సర్కిల్, హైద్రాబాదు.

జాతీయ సైనిక విద్యార్థి వైమానికదళం

శిక్షణానంతర వీడ్కోలు సమావేశంలో గోయాల్ ప్రసంగం

హైద్రాబాద్, జులై 15

"మన యువజనుల సుసంఘటిత శక్తే మనకు అమూల్యమైన పెట్టుబడి అనీ, ప్రపంచంలోని అత్యుత్తమయువ జన సంస్థలలో ఒకటైన మన జాతీయ సైనిక విద్యార్థి దళం ద్వారా అది మనకు సమకూరినదనీ ఆకాశ యుద్ధ శిక్షణ పాఠశాల కమెండెంట్ గోయాల్ జాతీయ సైనిక విద్యార్థి దళం తాలూకు వైమానిక దళం సీనియర్ డివిజను అభ్యర్థుల శిక్షణ ముగించుకుని వెడుతున్న సందర్భంలో నిన్న ఉదయం జరిగిన వీడ్కోలు సమావేశంలో ఉద్ఘాటించారు

దేశంలోని పలుప్రాంతాలకుచెందిన అనేకమంది అధ్యాపకులు, ప్రొఫెసర్లూ మూడు మాసాలపాటు తీవ్రతర శిక్షణ ముగించుకుని యీవాళ బయటికి వెడుతున్నారు. వైమానిక శాస్త్రం, వాతావరణశాస్త్రం వాటికి సంబంధించిన యితర విషయాల ప్రధాన సూత్రాలను గురించి వారికి తీవ్రతర శిక్షణ యివ్వబడింది.

దేశభక్తి మానవ కారుణ్యం, నూతనవిషయాసక్తి మొదలైనవాటిని గురించి బోధించే యువజనులను సక్రమ మార్గంలో పెట్టాలని ఎయిర్ కమొడోర్ గోయాల్ చెప్పారు. ఎవరో కొందరుతప్ప దేశంలోని కొత్త తరంవారు దేశ పురోభివృద్ధి కృషి నిర్వహణకు ఆశాజనకంగా వున్నారని కూడా ఆయన అన్నారు.

కోయంబత్తూరుకు చెందిన పైలటు ఆఫీసరు శ్రీ రాఘవన్ అత్యుత్తమ సైనిక విద్యార్థిగా నిర్ణయించి ఆయనకు పతకాన్ని బహూకరించారు. గ్రూప్ కాప్టెన్ శర్మ, శ్రీ ఐ. హెచ్. లతీఫ్‌లు కూడా హాజరైనారు.

జనాభా లెక్కల కార్యకర్తలకు పతకాలు

హైద్రాబాద్, జులై 15

రానున్న జనాభా లెక్కల సేకరణ సందర్భంలో లోగడవలెనే విశేషమైన పట్టుదలతోనూ, కడునైపుణ్యంతోనూ పనిచేసి గణతికెక్కే జనాభా లెక్కల కార్యకర్తలకు జనాభా లెక్కల సేకరణ పతకాలు దేశవ్యాప్తంగా బహూకరించడానికి భారత ప్రభుత్వం నిర్ణయించింది.

1951 జనాభా లెక్కల సందర్భములో అట్టి పతకాలను పొంది వుండి తిరిగి 1961 జనాభా లెక్కల సందర్భములో పనిచేయనున్న కార్యకర్తలు ఆ దేశ తరగతులకు హాజరయ్యేటప్పుడూ, తమ విధులను నిర్వహించేటప్పుడూ ఆ పతకాలను ధరించవచ్చునని ఆంధ్రప్రదేశ్ జనాభా లెక్కల కలాపాల సూపరింటెండెంటు ఒక పత్రికా ప్రకటనలో తెలియ చేశారు.

హిందూ దేవాదాయ మతాదాయాల సంఘం ప్రశ్నావళి

న్యూఢిల్లీ, జూలై 15: హిందూ మతాదాయ దేవాదాయాల సంఘం పబ్లిక్ సంస్థలకూ, హిందూ దేవాలయాలు, మఠాలు, యితర పీఠాలు మేనేజిమెంటు సంరక్షణలందు ఆసక్తిగల సంస్థలకూ, వ్యక్తులకూ జారీచేసిన ప్రశ్నావళికి సమాధానాలు పంపే గడువు తేదీ జూలై 31 వరకూ పొడిగించారని ఆ సంఘం ఒక పత్రికా ప్రకటనలో తెలియ చేసింది.

పాఠశాలా విద్యార్థుల ఆరోగ్య ప్రమాణాల పరిశీలన సంఘం

పాఠశాలా విద్యార్థుల ఆరోగ్య వ్యవహారాల సంఘం విడుదల చేసిన ప్రశ్నావళికి సమాధానాలు పంపే గడువు తేదీ జూన్ 30 నుంచి జూలై 20కి పొడిగించబడింది. పాఠశాలా విద్యార్థుల ఆరోగ్య ప్రమాణాలనూ, పోషక శక్తినీ పరిశీలించి వాటిని మెరుగు పరచడానికి చర్యలుసూచించే నిమిత్తం శ్రీమతి రేణుకారే అధ్యక్షత క్రింద కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆ సంఘాన్ని నెలకొల్పింది.

రు. 5/- లకు రేడియో



ఈ రేడియో విద్యుత్ మరియు బ్యాటరీ లేకుండా శ్రావ్యమైన సంగీతము నిచ్చును. మా నూతన స్కీము ప్రచారమునకు యిది ప్రవేశపెట్టినది. పరిమితమైన స్టాకు నిరాశ చెందక వెంటనే ఆర్డర్లు పంపండి.

American Radio House,
Goal Bagh/ R- 10/ Amritsar.

శార్వరి సం॥ ఆషాఢ బ॥ అష్టమి
ఉ 9-34 అశ్విని రా 11-6
సా వ 6-50 మొ: 8- 32 వరకు
శుక్రమౌఢ్య నివృత్తి
(శాలివాహన శకము: 25-4-1882)
1960 జూలై 16 శనివారము

"ధర్మంబు పెరుఁగు
వైదిక కర్మఫలము
లెసఁగు ఋతు
నికాయము ప్రజకున్
శర్మం బొనర్చు
నాయువు పేర్మిఁ
బొరయు దునక పెద్ద
పృథివి ఫలించున్".

-భారతము (శాంతి)

గోలకొండపత్రిక

ఫోన్. నెం. 3280

1960 జూలై 16
శని వారము

పోచంపాడు ప్రాజక్టు

ఆంధ్రప్రదేశ్ శాసనసభలో నొక ప్రకటన గావించుచు ఆర్థిక మంత్రి శ్రీ బ్రహ్మానంద రెడ్డిగారు పోచంపాడు ప్రాజక్టు నిర్మాణ కార్యక్రమము నిరాటంకముగా ప్రారంభమై జరుగునట్లు ప్రభుత్వము యావచ్ఛక్తితో కృషి చేయగలదని ఉద్ఘాటించియున్నారు. పోచంపాడు ప్రాజక్టు నిర్మాణము చేయుటకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము కొన్ని నెలల క్రిందనే నిశ్చయించినది. కాని పని ప్రారంభమగుటలో యే కారణము వలననో కొంత ఆలస్యము జరుగుచున్నది. ఈ ఆలస్యమును నివారించి సత్వరమే నిర్మాణ కార్యక్రమము ప్రారంభమగునట్లుగా కావలసిన యేర్పాటులు జేయుట మిక్కిలి అవసరము.

బొంబాయి ప్రభుత్వము గోదావరి జలాల -పంపకమును గూర్చి చేసిన ఆక్షేపణ కొంత ఆలస్యానికి కారణభూతమైనది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పబ్లిక్ వర్క్సు మంత్రి శ్రీ అల్లూరి సత్యనారాయణరాజు గారు బొంబాయి ప్రభుత్వముతో యీ విషయమై సమాలోచనలు గావించి యీ ఆక్షేపణను బొంబాయి ప్రభుత్వము ఉపసంహరించుకొనునట్లుగా కృషి చేసియున్నారు. శ్రీ సత్యనారాయణరాజుగారి కృషి ఫలితముగా యీ ప్రతిబంధకము తొలగిపోయి సుమారు మూడు నెలలు గడచుచున్నవి. ప్లానింగ్ కమిషన్ ఆమోదము యింకను యీ ప్రాజక్టుకు లభించనట్లు తెలియుచున్నది. ఈ ఆమోదము సత్వరముగా లభించగలదని ఆశించుచున్నాము.

పోచంపాడు ప్రాజక్టు తెలంగాణ ప్రాంతమునకు కల్పవృక్షమువంటిది. అందుచేత వెనుకబడిన తెలంగాణ ప్రాంతముయొక్క అభివృద్ధి దృష్ట్యా యీ ప్రాజక్టును రెండవ పంచవర్ష ప్రణాళికలోనే ప్రారంభించవలసిన ఆవశ్యకత యెంతయో కలదు. మూడవ ప్రణాళికలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించుటకు నిశ్చయించిన మొత్తములో మూడవవంతు నీటి పారుదల ప్రాజక్టుల కొరకు ప్రత్యేకించబడినది. ఇందులో పదునైదు కోట్ల రూపాయలు పోచంపాడు నిర్మాణానికి ప్రత్యేకించబడినవి పోచంపాడు ప్రాజక్టు నిర్మాణము సత్వరముగా జరుగగలదని తెలంగాణ ప్రజలు కొండంత ఆశతోనున్నారు. ఈ పని ప్రారంభము గావించుటలో జరుగుచున్న ఆలస్యము యిప్పటివరకే అనేక అనుమానాలకు దారి తీసినది. అందుచేత యీ విషయమై యింకను యెక్కువ ఆలస్యము గావించక (మహారాష్ట్ర ప్రభుత్వము యొక్క ఆక్షేపణకూడ తొలగిపోయినది కావున) ప్లానింగ్ కమిషన్ తత్క్షణమే యిందుకు ఆమోదము లభింపజేయగలదని ఆశించుచున్నాము. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము తన నిర్ణయానుసారము యీ విషయమై గట్టి పట్టుదలతో కృషి గావించి, ప్లానింగ్ కమిషన్ ఆమోదమును సాధ్యమైనంత త్వరగా సంపాదించి శీఘ్రముగా పోచంపాడు ప్రాజక్టు నిర్మాణ కార్యక్రమము ప్రారంభింపజేయవలెనని తెలంగాణ ప్రాంతప్రజలు యేకకంఠముగా కోరుచున్నారు.

పడవ ప్రమాదాల నివారణ

పడవ ప్రమాదాల నివారణ సమస్యను పరిశీలించి తగు సూచనలు గావించుటకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము నియమించిన సంఘముయొక్క నివేదిక శాసనసభలో ప్రవేశపెట్టబడినది. ఈ నివేదికలో చేయబడిన సూచనలు గమనించదగియున్నవి. గడచిన రెండు, మూడు సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన పడవ ప్రమాదాల దృష్ట్యా యిక ముందు వాని నివారణకు గట్టి చర్యలు తీసికొనవలసియున్నది. రెండు సంవత్సరాల క్రింద భద్రాచలమువద్ద జరిగిన ప్రమాదము, యిటీవలనే తంగెడ వద్ద కృష్ణానదిలో జరిగిన ప్రమాదము పడవ ప్రమాదాల నివారణ విషయమై అప్రమత్తతతోనుండవలసిన ఆవశ్యకతను ఉద్ఘాటించుచున్నవి.

పడవలను నడుపువారికి లైసెన్సులు యిచ్చుటలో తగు శ్రద్ధ వహించవలసియుండును. పడవలో ప్రయాణము చేయవలసిన జనుల సంఖ్య మరియు పడవను నడుపుటలో తీసికొనవలసిన శ్రద్ధనుగూర్చి తగు నియమాలు గావించి వానిని అమలు జేయవలసియుండును. ఈ ప్రమాదాలకు గురియైనవారు పుణ్యస్థలాలకు వెళ్ళిన యాత్రికులు కావున దేవాలయాలకు, తీర్థయాత్రాస్థలాలకు వెళ్ళు జనులు ప్రయాణము చేయు పడవల మీద అవసరమైన పర్యవేక్షణ గావించు బాధ్యత దేవాదాయ, ధర్మాదాయ శాఖకు అప్పగించవలెనని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము నియమించిన యీ సంఘము గావించిన సూచన గమనించదగియున్నది. పోలీసు శాఖకూడ యీ విషయమై తన బాధ్యతలను యితోధిక శ్రద్ధతో నెరవేర్చవలసి యుండును. ఈ సంఘము గావించిన సూచనల దృష్ట్యా పడవ ప్రమాదాలనివారణకు ప్రభుత్వము సమర్థవంతమైన చర్యలు తీసికొనగలదని ఆశించుచున్నాము.

మానవునికి క్షుద్బాధ తీరితే సరిపోదు

అతనికి విజ్ఞాన తృష్ణను తీర్చడానికి సాంస్కృతిక కార్యకలాపాల్ని ప్రోత్సహించాలని గవర్నర్ శ్రీ భీంసేన్ సచార్ వివరణ

హైద్రాబాదు, జులై 15

మానవుని క్షుద్బాధను తీరిస్తేనే సరిపోదు. అతని మానసిక ఆకలిని కూడ తీర్చడం చాల అవసరం. అందుకే సాహిత్య, సాంస్కృతిక కార్యకలాపాల్ని ప్రోత్సహించి మానవాభ్యుదయానికి కృషిచేయాలి"అని రాష్ట్ర గవర్నర్ శ్రీ భీంసేన్ సచార్ నిన్న సాయంత్రం సరోజినీనాయుడు హాలులో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతి సంవర్ధక సమితి పంచమ వార్షికోత్సవాల్ని ప్రారంభిస్తూఅన్నారు.

నంబూరి శ్రీనివాసరావుగారి సాంస్కృతి సంవర్ధక సమితి కార్యకలాపాల్ని చాలకాలముగా గమనిస్తున్నానని, ఆయన ఎంతో ప్రతిభావంతుడయిన నటుడనీ. ఆయన కార్యదీక్ష ప్రశంసనీయమైనదనీ గవర్నర్ అన్నారు. ఈ సమితి తన కార్యకలాపాల్ని విస్తృతపరచి ప్రజలకు మరింతగా సేవచేయగలదనే ఆశాభావాన్ని గవర్నర్ వ్యక్తపరిచారు.

పత్రికా ప్రచురణ, పుస్తకప్రచురణ వంటి యీ సమితిచేపట్టిన మంచిపనులకు సాహితీ పరులు, ప్రజలు ఇతోధికంగా ధనసహాయం చేసి తోడ్పడాలని కూడ గవర్నర్ సచార్ విజ్ఞప్తి చేశారు.

గవర్నర్ ఉర్దూ ప్రసంగాన్ని సమాచారశాఖ అసిస్టెంటు డైరెక్టర్ శ్రీ కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి తెనిగించారు.

ప్రార్థనతో పంచమ వార్షికోత్సవ కార్యక్రమం ప్రారంభమయింది. ముందుగా సమితి అధ్యక్షుడు శ్రీ నంబూరి శ్రీనివాసరావు (ఎం. ఎల్. ఏ.), అతిథులకు స్వాగతంచెబుతూ సమితి కార్యక్రమాన్నీ, ఆశయాలనూ వివరించారు. సమితి "నవసమాజ్" అనే వైజ్ఞానిక వారపత్రికను, పుస్తకాలను ప్రచురిస్తుందనీ, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుందనీ ఆయన అన్నారు. గత ఐదేండ్లుగా సమితి సాధించిన అభివృద్ధిని వివరిస్తూ కవిత్వము, నృత్యనాటకములు సంగీతము లాటి కళల్ని ఆదరించి పెంపొందించుటకు ఒక పుస్తకభాండాగారాన్ని శిక్షణాలయాన్నీ స్థాపించాలనేది సమితి లక్ష్యమన్నారు.

ఆర్థికంగా బాధపడుతున్న విద్యావంతులయిన రచయితలు, కళాకారులకు ఉచితవేతనములివ్వడం వార్ధక్యంలో ఉన్న కళాకారులు, కవులకు ఆర్థిక సహాయం చేయడం, వైజ్ఞానిక ప్రతినిధివర్గాల్ని యితర రాష్ట్రాలకు, యితర దేశాలకు పంపించుట, ప్రభుత్వంలో నిర్వహించబడే సమాజాభివృద్ధి హరిజన స్త్రీ సంక్షేమాభివృద్ధి వంటి కార్యక్రమాల్ని ప్రోత్సహించడంకూడ తమ లక్ష్యమని శ్రీనివాసరావు వివరించారు.

"నవసమాజ్" ఆవిష్కరణ

ఆతర్వాతముఖ్యమంత్రి శ్రీదామోదరం సంజీవయ్య సమితి ప్రచురిస్తున్న "నవసమాజ్" వారపత్రికకు ప్రారంభోత్సవం చేస్తూ పత్రికల్ని నడుపడం లోగల సాధకబాధకాల్ని వివరించారు. ముద్రణాలయం లేకుండా ఒక వారపత్రికను నడపడం చాల కష్టసాధ్యమయినపనిఅనీ, అయినా అనేకమంది మిత్రులు, శ్రేయోభిలాషులూగల శ్రీ నంబూరి శ్రీనివాసరావు యీ గురుతరమయిన బాధ్యతను నిరాటంకంగా నిర్వహించగలరని ఆశిస్తున్నానని అన్నారు.

చివరకు సభకు అధ్యక్షత వహించిన పబ్లిక్ వర్క్సుమంత్రి శ్రీ అల్లూరి సత్యనారాయణరాజు ప్రసంగిస్తూ శ్రీనివాసరావు నెలకొల్పిన ఈ సమితి కార్యకలాపాల్ని అప్పుడప్పుడూ వింటూవుండే వాడిననీ, యిప్పుడు స్వయంగాచూసి సంతృప్తి చెందాననీ అన్నారు. ఆయన గాయకుడు,నటుడు కవి, హరిజననాయకుడు, రాజకీయాలలో ప్రముఖపాత్ర వహిస్తున్నవాడు ఇన్ని కార్యకలాపాల్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్న ఆయన ఉత్సాహాన్ని ప్రశంసించవలసి ఉంది.

అయితే పత్రికాప్రచురణలోని సాధకబాధకాల్నికూడ ఇక్కడ చెప్పవలసి వుంది. నా 30 సంవత్సరాల రాజకీయ జీవితంలో నా సహచరులు ఎందరో పత్రికల్ని నెలకొల్పడం చూచాను. అయితే వారిలో అధిక సంఖ్యాకులు భగ్నహృదయులైనారు. "ఇల్లుకట్టిచూడు, పెళ్ళిచేసి చూడు" అని అంటుంటారు. ఆ రెండూ కఠినమయినవనే అభిప్రాయంతో అలా అంటారు. పత్రికా నిర్వహణ కూడ అలాంటిదే. సరియైన పత్రికలు ప్రజాభ్యుదయానికి తోడ్పడగలవు. ప్రజలకు మార్గదర్శకత్వం వహించి వివిధ సమస్యలకు పరిష్కారాల్ని సూచించగలవు అలాంటి బాధ్యతను శ్రీనివాసరావు స్వీకరించడం హర్షణీయం అయన నాకుఅత్యంతసన్నిహితమిత్రుడయినందున యీ సందర్భంలో పత్రికానిర్వహణలోని సాధక బాధకాల్ని కూడ పేర్కొన్నాను.

ఈ కార్యభారాన్ని నిర్వహించడానికి ఉత్సాహవంతులయినసహచరులుండాలి. అన్నిటి మించి డబ్బుకావాలని శ్రీ అల్లూరి అన్నారు. అభిమానులయిన ప్రజలు ఇతోధికంగా ఆర్థిక సహాయం చేయగలరనే ఆశాభావాన్ని ఆయన వెలిబుచ్చారు.

ఆతర్వాత శ్రీ నంబూరి శ్రీనివాసరావు (ఎం. ఎల్. ఏ.), బృందంవారి "అంటరానివారెవరు?" అనే నృత్యనాటిక ప్రదర్శించబడింది. కుమారిచే ముక్తనృత్య ప్రదర్శనం అందరినీ ఆకర్షించినది. రాత్రి నాగార్జున నాట్యమండలి (బందరు) వారు "పాండవోద్యోగ విజయములు" నాటకాన్ని ప్రదర్శించారు.

మంత్రులు, శాసనసభ్యులు,ప్రభుత్వ శాఖాధిపతులు యితర అధికార అనధికార ప్రముఖులు చాలమందిహాజరైనవారిలో గలరు.

శాసనమండలి ఓటింగ్ పద్ధతిలో మార్పు

హైద్రాబాదు, జులై 15

ఒకబిల్లును ఓటింగుకు పెట్టినప్పుడు వోటర్ల పేర్లను తెలిపే ఒకకొత్తపద్ధతిని ఆంధ్రప్రదేశ్ లెజిస్లేచర్ కౌన్సిల్‌లో ప్రవేశపెట్టారు ఇదివరకున్న ఆచారంలో ఓటర్లను లెక్కించే వారేకాని వారిపేర్లతో ప్రమేయం లేకపోయేది. ఆంధ్రప్రదేశ్ భూకమతాల బిల్లుకు సవరణ జరిగిన సందర్భంలో ఈ పద్ధతి అవలంబించ బడినది. ఈ సమావేశానికి ఉపాధ్యక్షుడు శ్రీ జి. సుబ్బరాజు అధ్యక్షత వహించారు. సవరణపై ఓటింగ్ జరిగినప్పుడు కేవలం సంఖ్యను లెక్కించుటకు మారుగా వారిపేర్లను కూడ వ్రాసివుంచాలన్న ఈసలహాను శ్రీ జి. బాపనయ్య (కమ్యూ) ఇచ్చారు.

ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమీ

హైద్రాబాద్, జులై 15

"ఆంధ్రప్రదేశ్ లలిత కళా అకాడమీ" అనే పేరుతో ఒక అకాడమీని స్థాపించడానికి ప్రభుత్వం నిశ్చయించింది. ఇదిలలితకళాఅకాడమీ (-నేషనల్ అకాడమీ ఆఫ్ ఆర్ట్సు-)కి అనుబంధంగా వుంటుంది. దీని కేంద్ర కార్యస్థానం హైదరాబాదులో ఏర్పాటు చేయబడుతుంది. అయితే జనరల్ కౌన్సిల్ లో తీర్మానం చేయడం ద్వారా కార్యస్థానాన్ని మరేదైనా ప్రదేశానికి మార్చవచ్చు. అందుకు జనరల్ కౌన్సిల్ మొత్తం సభ్యులలో నాలుగింట మూడు వంతుల మంది తీర్మానాన్ని బలపరచవలసి వుంటుంది.

అకాడమీ విధులు యీ విధంగా వుంటాయి:-1. అర్హులైనవారికి ఉపకార వేతనాలను బహూకరించడం ద్వారా లలితకళల (-దృశ్య, ప్లాస్టిక్ కళ-)లో అధ్యయనాన్నీ, పరిశోధనలను ప్రోత్సహించడం (-ఉపకార వేతనాలను ఎంతవరకు ఇవ్వవలసిందీ ఎకాడమీ నిర్ణయిస్తుంది) 2. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధకళా సంస్థల కార్యకలాపాలను సమన్వయ పరచడం, 3. అవసరమైన ప్రదేశాలలో ప్రాంతీయ ఆర్టుగ్యాలరీల స్థాపనను ప్రోత్సహించడం, 4. మోనోగ్రాఫులు, పత్రికలు, ఆల్బములు, మొదలైనవాటితో సహా ఆంధ్రప్రదేశ్ ప్రాచీన మధ్యకాలిక, సమకాలిక కళలపై పుస్తకాలను ప్రచురించడం. 5. ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఇతర రాష్ట్రాలలోనూ రాష్ట్ర చిత్రకారుల చిత్రకళా ప్రదర్శనలనూ, సామూహిక కళాప్రదర్శనలను ఏర్పాటుచేయడం, 6. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్రకారుల చిత్రకళా ప్రదర్శనాన్ని, అఖిలభారత చిత్రకళాప్రదర్శనాన్నీ ప్రతిసంవత్సరం రాష్ట్రంలో ఏర్పాటు చేయడం, 7. కళాప్రదర్శనలను ఏర్పాటు చేయడం పరస్పరం ఉద్యోగులను పంపించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ సంబంధాలను పెంపొందించడం, 8. ఆంధ్రప్రదేశ్‌కిచెందిన అర్హులైన కళాకారులకు ఉపకారవేతనాలు, బహుమతులు ఇవ్వడం, 9. ప్రతిభావంతులైన కళాకారులకు పరిగణన లభింపజేయడం, 10. ఆంధ్రప్రదేశ్ జానపద కళల పునరుద్ధరణనుప్రోత్సహించడం. 11.సంప్రదాయకమైన కళలను పునరుద్ధరించడం, సజీవులైవున్న దేశీయశిల్పులు, చిత్రకారులు మొదలైనవారిని గురించిన భోగట్టా సేకరించడం.

ఈ అకాడమీకి జనరల్ కౌన్సిల్, కార్యవర్గ బోర్డు, ఆర్థిక సంఘం వుంటాయి. ఇవిగాక జనరల్ కౌన్సిల్ చేతగానీ, కార్యవర్గబోర్డుచేతగానీ నియమించబడిన స్థాయీ సంఘాలు లేదా అడ్‌హాక్ కమిటీలు కూడా వుంటాయి.

రాజాజీపై వచ్చిన ప్రివిలేజిప్రతిపాదన

ప్రివిలేజి కమిటీకి నివేదిస్తూ స్పీకర్ రూలింగ్

హైద్రాబాద్ జూలై 15

స్వతంత్రపార్టీ వ్యవస్థాపకుడు శ్రీ సి. రాజగోపాలాచారిపై రాష్ట్రశాసనసభకు వచ్చిన ప్రివిలేజి తీర్మానాన్ని స్పీకర్ శ్రీ కాళేశ్వరరావు నేడు ప్రివిలేజి కమిటీకి నివేదించారు.

గత మార్చి 24 న రాజాజీ చండీగఢ్ బార్ అసోసియేషన్ సమావేశములో ప్రసంగిస్తూ శాసనసభలలోని కాంగ్రెసు ప్రతినిధుల్ని ఏ మొదటి తరగతి మేజిస్ట్రేట్ అయినా అరెస్టు చేయించవచ్చుననీ, వారికి చెప్పుకోదగ్గ ఆదాయ మార్గాలులేవనీ అన్నట్లు "ఇండియన్ ఎక్స్‌ప్రెస్" పత్రికలో వార్త వచ్చింది.

కాంగ్రెసు పార్టీకి చెందిన నల్గురు సభ్యులు ఆ విషయమై ప్రివిలేజి ప్రతిపాదనను తెచ్చారు. దానిపై లోగడ రెండుసార్లు శాసనసభలో చర్చ జరిగింది. రెండోసారి స్పీకర్ తన రూలింగ్‌ను వాయిదా వేశారు.

నేడు తన రూలింగ్‌ను యిస్తూ ఆంధ్రప్రదేశ్ శాసనసభలోని కాంగ్రెసు సభ్యుల హక్కులకు భంగం కలిగిస్తూ రాజాజీ ప్రసంగించారనడానికి ఆస్కారం ఉందనీ అందువలన యీ అంశాన్ని పరిశీలించి, నివేదికను సమర్పించడానికి ప్రివిలేజి కమిటీకి నివేదిస్తున్నాననీ స్పీకర్ అన్నారు. తానామాటలు అనలేదనీ రాజాజీ ఖండించలేదని కూడ యీ సందర్భములో స్పీకర్ పేర్కొన్నారు.

సభ ముందున్నప్పుడు ఆ అంశాన్ని ప్రివిలేజి కమిటీకి స్పీకర్ నివేదించరాదనీ, దానిని సభ నిర్ణయించాలనీ శ్రీ గౌతు లచ్చన్న (స్వతంత్ర) ఒక పాయింట్ ఆఫ్ ఆర్డర్ తెచ్చారు. స్పీకర్ యీ అభ్యంతరాన్ని తోసిపేస్తూ శాసనసభ నియమాల ప్రకారం కేసులో బలం ఉందని అనుకొంటే స్పీకర్ ప్రివిలేజి కమిటీకి నివేదించవచ్చుననీ, సభను సంప్రతించవలసిన అవసరంలేదనీ అన్నారు.

రాజాజీపై ప్రివిలేజ్ తీర్మానం

గత మార్చి నెలలో చండీగఢ్‌లో జరిగిన బహిరంగసభలో స్వతంత్ర పార్టీనాయకుడు శ్రీ సి రాజగోపాలాచారి కాంగ్రెసు ఎం ఎల్. ఏ.లపై చేసిన ఆరోపణలపై ఆంధ్ర శాసన సభలో మునుపు తేబడిన ఒక ప్రివిలేజ్ తీర్మానంపై మొన్న స్పీకర్ శ్రీఅయ్యదేవర కాళేశ్వరరావు తన రూలింగును వాయిదావేశారు.

ఈ తీర్మానం స్పీకర్‌కు తనచేంబరులో సమర్పించబడినదే కాని సభలో ప్రవేశ పెట్టబడినది కాదని ప్రతిపక్ష నాయకుడు శ్రీ పుచ్చలపల్లి సుందరయ్యఅంటూ అట్టి దానిపై సభలో చర్చించుట యెంత వరకు సబబైనదో తన రూలింగును యివ్వాలని స్పీకర్‌ను కోరారు. ఈ తీర్మానంపై తన రూలింగ్ ఇచ్చేప్పుడు ఈ విషయమై ప్రస్తావించెదనని స్పీకర్ తెలిపారు.

ప్రధాని లుముంబాకు గాయం

లియోపోల్డివిల్లె, జులై 15: విమానాశ్రయములో ప్రధాని లుముంబాను నిన్నరాత్రి విమానాశ్రయంలో బెల్జియన్లు చుట్టుముట్టి "హంతకుడు" అని నినాదాలుచేస్తూ గంద్రగోళము లేవదీశారు. ఆయన ముఖముపై యీ సందర్భములో ఒక గట్టిదెబ్బ తగిలింది.

అసెంబ్లీ ప్రశ్నోత్తరాలు:

రాష్ట్రంలోగల ఏడు డిస్టిలరీల ఉత్పత్తి

మొత్తం 82 లక్షల గ్యాలన్లనీ, అందులో 34 లక్షలు మిగిలి పోతున్నదనీ వివరణ

హైద్రాబాద్, జులై 15

ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య నేడు రాష్ట్ర శాసనసభలో శ్రీ రాజగోపాల నాయుడు ప్రశ్నకు జవాబిస్తూ రాష్ట్రంలో బోధన్, తుమ్మపాల, ఉయ్యూరు, సామర్లకోట బొబ్బిలి, నారాయణగూడ, కామారెడ్డిలలో ఏడు బట్టీలు ఉన్నవన్నారు.

బోధన్ ఆల్కహాలు ఫ్యాక్టరీలో ఉత్పత్తి 20 లక్షల గ్యాలన్‌లకు పెంచబడిందన్నారు. అనకాపల్లిలో 1.44 లక్షల గ్యాలన్‌లనుండి 6 లక్షల గ్యాలన్లకు పెంచించబడిందన్నారు.

తణుకులో పవర్ ఆల్కహాలుఉత్పత్తికి ఒక ఫ్యాక్టరీకి అనుమతించాలనే ప్రశ్నను ప్రభుత్వం పరిశీలిస్తున్నదని ఆయన అన్నారు. రాష్ట్రంలోమొత్తం 82 లక్షల గ్యాలన్‌లు ఉత్పత్తి అవుతున్నదనీ అందులో 34 లక్షల గ్యాలనులు అదనముగా ఉన్నందున దానిని ఎగుమతిచేసేప్రశ్న పరిశీలనలోఉందని ఆయన అన్నారు.

ఇరిగేషన్ పథకాలు

పబ్లిక్ వర్క్సు మంత్రి శ్రీ అల్లూరి సత్యనారాయణరాజు ఒక ప్రశ్నకు జవాబిస్తూ 1960-61 లో మెదక్‌లో 2, శ్రీకాకుళంలో 2, చిత్తూరులో 3, తూర్పు గోదావరి, అనంతపురం, ఆదిలాబాద్, హైద్రాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాలలో ఒక్కొక్కటి చొప్పున మీడియం ఇరిగేషన్ పథకాలు సంకల్పించబడినవని అన్నారు.

వరంగల్‌లో ఒక పథకం పూర్తయినదనీ, మిగిలిన వాటిని అంచనాలు మంజూరయిన వెంటనే చేపట్టగలమనీ ఆయన అన్నారు.

స్పెషల్ గ్రేడు ఇంజనీర్లు

మంత్రి శ్రీ పి. గోపాలరెడ్డిప్రశ్నకు జవాబిస్తూ విద్యుచ్ఛక్తి శాఖలో నిరు. 800-1000 గ్రేడ్ లో కొన్ని స్పెషల్ గ్రేడ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల పదవుల్ని సృష్టించాలనే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తున్నదని అన్నారు.

ఎలక్ట్రిసిటీ బోర్డు

మరోప్రశ్నకు మంత్రి జవాబిస్తూ 1959 ఏప్రిల్ నుండి 1960 జూన్ వరకు రు. 7 కోట్ల 53 లక్షల విలువయిన పథకాల్ని రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డు మంజూరు చేసిందని అన్నారు.

చిత్తూరు జిల్లా పాఠశాలలు

విద్యామంత్రి శ్రీ పట్టాభి రామారావు శ్రీ నాయుడు ప్రశ్నకు జవాబిస్తూ చిత్తూరు జిల్లాలోని ఎయిడెడ్ పాఠశాలల్ని తీసుకోవడం వలన ప్రభుత్వము ఏటా అదనముగా రు. 39,294 లను ఖర్చు చేస్తున్నదన్నారు.

ఇంజనీరింగ్ కళాశాలలు

మంత్రి మరో ప్రశ్నకు జవాబిస్తూ కాకినాడ, అనంతపురంలలోని రెండు ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలకు హైద్రాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాలకు శాశ్వతభవనాలు, లేబొరేటరీలు సమకూర్చ బడినవని అన్నారు. వాల్తేరులోని ఆంధ్ర విశ్వవిద్యాలయ ఇంజనీరింగుకళాశాలకు శాశ్వతభవననిర్మాణబడుతున్నదన్నారు. వరంగల్‌లోని కేంద్రఇంజనీరింగ్ కళాశాల భవననిర్మాణ కార్యక్రమాన్ని గవర్నర్లబోర్డు పరిశీలిస్తున్నది. తిరుపతిలో విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ కళాశాల 1959-60 సంవత్సర కాలంలోనే నెలకొల్పబడిందనీ, అదింకా అభివృద్ధి చెందవలసి ఉందనీ మంత్రి అన్నారు.

ఆయకట్టల అభివృద్ధి

ప్లానింగ్‌మంత్రి శ్రీ పిడతల రంగారెడ్డి శ్రీ కాళారెడ్డి ప్రశ్నకు జవాబిస్తూ మేజర్, మీడియం ఇరిగేషన్ పథకాల క్రిందగల ఆయకట్టల అభివృద్ధి కృషిని తరచు సమీక్షిస్తూ యిబ్బందుల్ని తొలగించడానికి మంత్రివర్గ స్థాయిలో ఒక ప్రత్యేక కమిటీని 1960 ఏప్రిల్ 22 న ప్రభుత్వం నియమించినదన్నారు. ఈ కమిటీ అన్ని అంశాల్ని పరిశీలించి ఇరిగేషన్ అభివృద్ధి బోర్డుకు, ఆయా శాఖలకు తగు ఉత్తర్వులు చేస్తుందని ఆయనన్నారు.

ఈ కమిటీ సభ్యులు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, పబ్లిక్ వర్క్సు, ప్లానింగ్, వ్యవసాయ మంత్రులు, ప్రధాన కార్యదర్శి, రెవిన్యూ, వ్యవసాయ, ప్లానింగ్ కార్యదర్శులు, వ్యవసాయశాఖ డైరెక్టర్, ప్రత్యేక చీఫ్ ఇంజనీర్, ఇరిగేషన్ ఇంజనీర్.

తెలంగాణ ఉద్యోగులు

అటవీ మంత్రి శ్రీ మల్లిపూడి పళ్ళంరాజు శ్రీ చొక్కారావు ప్రశ్నకు జవాబిస్తూ తెలంగాణ నిబ్బందికిచ్చిన రక్షణల ప్రకారం వారికి లోగడవలె నిర్లిక్షిత టి. ఏ. పొందే అవకాశం కల్పించబడిందనీ, వారు కూడ ఆంధ్ర ఉద్యోగుల

ఐదో ప్రణాళికాంతం వరకు సమ్మెలు నిషేధించాలి

లోకసభ సెషన్‌కు నోటీసు ఇవ్వబడిన అనధికార తీర్మానాలు

న్యూఢిల్లీ, జులై 15

ఆగస్టు 1 న ప్రారంభమయ్యే లోకసభ వర్షాకాల సమావేశంలో పరిశీలనకు 110 అనధికార తీర్మానాలను స్పీకర్ శ్రీ అనంతశయన అయ్యంగార్ ఆమోదించారు. ఆరు శుక్రవారాల్లో 15 గంటలు సమయం అనధికార వ్యవహారాలకై కేటాయించబడ్డాయి.

ఐదో పంచవర్ష ప్రణాళిక పూర్తి అయ్యేదాకా దేశమంతటా అన్ని రంగాలలోను సమ్మెలు లాకౌట్లనిషేధిస్తూ పార్లమెంటు శాసనం చేయాలని కోరుతూ శ్రీ ఎస్.ఆర్.ఎం. స్వామి కాం), [స్వల్పాదాయవర్గాలకు కష్టం కలిగించని ధరల స్థాయిని నిర్ధారించడానికై ఒక ధరలకమిషన్ ఏర్పాటు చేయాలని శ్రీ దివాన్‌చంద్ శర్మ (కాం) రెండు ప్రతిపాదనలు తెస్తూ స్పీకర్‌కు తెలిపారు.

కేంద్రసిబ్బంది కష్టనష్టాల్ని పరిశీలించి వాటి నిర్మూలనకుగాను ఒక కమిటీని ఏర్పాటుచేయాలని కోరుతూ శ్రీ ఎ.ఎం. తరీఖు (కాం) ఒకప్రతిపాదన తెచ్చారు.

అన్ని ప్రాంతీయ భాషలకూ దేవనాగరిలిపి వాడకానికి తేవాలనికూడా శ్రీతరీఖ్ మరో ప్రతిపాదన తెస్తున్నారు.

కమ్యూనిటీ అభివృద్ధి మంత్రిత్వశాఖ రద్దుపరచబడాలనీ, ప్రతిరోజూ లోకసభ సమావేశం జాతీయ గీతంతో ప్రారంభంకావాలనీ కోరుతూ రెండు తీర్మానాలను శ్రీ మోహన్‌స్వరూప్ (పి. ఎస్. పి) ప్రతిపాదించనున్నారు.

అమెరికా అధ్యక్షపదవికి ఎన్నిక

డెమోక్రాటిక్ పక్ష అభ్యర్థిగా సెనేటర్ కెన్నెడీ గెల్పు

లాస్ ఏంజిల్స్, జులై 15

సెనేటర్ జాన్ కెన్నెడీ నిన్న ప్రథమ బ్యాలట్ పత్రముతో అధ్యక్ష అభ్యర్థిగా ఎన్నికయినట్లు డెమోక్రాటిక్ పార్టీ నామినేషన్‌ను పొందిరి.

సెనేటర్ కెన్నెడీ తాను సులువుగా నిశ్చయముగా యిది సాధించినట్లు చెప్పారు. మొదటిబ్యాలట్ పూర్తయే ముందు ఆతడు విజయము సాధించెను.

మధూదయ కావ్యావిష్కరణం

హైద్రాబాద్, జులై 15

నేటిసాయంత్రం 6 గంటలకు కాకినాడ పి ఆర్. ప్రభుత్వ కళాశాలాధ్యాపకులు శ్రీ ఉప్పాడ రాజారావు రచించిన "మధూదయ" కావ్యాన్ని శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం (సుల్తాన్‌బజార్)లో జరిగిన సభలో శాసనసభ స్పీకర్ శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు ఆవిష్కరించారు. ఆటవీమంత్రి శ్రీ మల్లిపూడి పల్భంరాజు అధ్యక్షత వహించారు. సాంబశివ రావు రచయితను పరిచయం చేశారు. డా॥ దివాకర్ల వేంకటావధాని కావ్యాన్ని పరిచయం చేశారు. శ్రీ పెద్దింటి రామస్వామి నాయుడు (ఎం. ఎల్. ఏ.), కావ్యపఠనం గావించారు. శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి శ్రీ ఉప్పాడ రంగబాబు (ఎం. ఎల్. ఏ.) ప్రభృతులుఆశీర్వచనములిచ్చారు.

బాలికల బహుళార్థ సాధకోన్నతపాఠశాల

విద్యార్థినీ సంఘసమావేశ ప్రారంభోత్సవము

హైదరాబాద్, జులై 15

నిన్న బాలికల బహుళార్థ సాధకోన్నతపాఠశాల విద్యార్థినీసంఘ ప్రారంభోత్సవము జరిగినది. దీనికి విద్యార్థినీ సంఘాధ్యక్షురాలు కుమారి బి.విజయలక్ష్మి అధ్యక్షతవహించిరి. వారాయణగూడ మహిళాకళాశాల కాలేజి ఆర్థిక శాస్త్రోపన్యాసకురాలు శ్రీమతి టి. శారద ప్రారంభోత్సవముచేసిరి. వారు తమ ఉపన్యాసములో పంచవర్షప్రణాళిక - విద్యార్థినుల పాత్ర అను అంశమును విపులీకరించిరి. విద్యార్థినీసంఘ కార్యదర్శిని కుమారి ఎం. మీరాబెన్ యొక్క వందన సమర్పణముతోను, విద్యార్థినుల మంగళగీతముతోనుసభా పరిసమాప్తి జరిగెను.

మున్సిపల్ కౌన్సిలర్లచే తపాలాబట్వాడా

మహబూబ్‌నగర్, జులై 15

కేంద్ర ప్రభుత్వపు ఉద్యోగులు తలపెట్టిన సమ్మె మూలకంగా పట్టణ మునిసిపాలిటీ కౌన్సిలర్లందరూ తమతమ వార్డులలో తపాలను పంచగలమని నిర్ణయించుకొన్నారు అత్యవసర పరిస్థితులలో సేవచేస్తామని ముందుకు వచ్చిన ఈ కౌన్సిలర్లకు అధ్యక్షుడు తమ అభినందనలు తెల్పారు

ఊట్నూరు కొత్తతహశీల్ భవనం

ఆదిలాబాద్, జూలై 15

ఈనెల 17 వ తేదీన ఊట్నూరులో కొత్తతహసీలుభవనానికి జిల్లాకలెక్టర్ శ్రీ వి. శ్రీనివాసాచారి ప్రారంభోత్సవం చేశారు. ఈభవనం రు 80వేల ఖర్చుతో నిర్మింపబడినది.

భూవసతి బిల్లుపై శాసన మండలి చర్చ

హైద్రాబాద్, జులై 15

రాష్ట్ర శాసనసభ ఆమోదించిన వ్యవసాయ కమతాల బిల్లుపై శాసన మండలి సాధారణ చర్చను పూర్తిచేసినది. క్లాజువారీ చర్చ నేడుప్రారంభం అయింది.

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఆమోదించిన భూ కమతాల బిల్లును నిన్న శాసనమండలి మొదటి పఠనాన్ని ప్రారంభించినది. కేవలం భూమి సమస్యను పరిష్కరించుటద్వారా పేదతనాన్ని నిర్మూలిస్తామని భావించడం భ్రమని చర్చకు సమాధానమిస్తూ ఉపముఖ్యమంత్రి శ్రీ కె. వి. రంగారెడ్డి అన్నారు లక్ష్యమయ్యే భూమితో పోల్చిన భూమి లేనివారిసంఖ్య అధికముగా వున్నదన్నారు. మినహాయింపులు, నష్టపరిహారాలతో కూడిన ఈ బిల్లు ఇతర రాష్ట్రాలవారు చేసిన దానికన్న ఎన్నోరెట్లు బాగున్నదని భూ కమతాల బిల్లును సమర్థిస్తూ శ్రీ కె. వి. రంగారెడ్డి మాట్లాడారు. (మద్రాసు హోంమంత్రి శ్రీ భక్తవత్సలం కొంతసేపు ఈసభలో కూర్చున్నారు.) ఇదివరకే తెలంగాణాలో అమలులో నున్న భూసంస్కరణల అనుభవం దృష్ట్యా రూపొందించబడిన ఈబిల్లు శాస్త్రీయంగా వున్నదన్నారు. కమతాలను ఎకరాలలో నిర్ణయించినప్పటికి హైద్రాబాద్ చట్టంలో నిర్ణయించినట్టి రు 3600 వార్షికాదాయం ఆధారంగానే రూపొందించబడినదన్నారు. కేవలంప్రభుత్వమే భూమిని తీసికొని పంపిణీ చేయాలన్నది ఈ సంస్కరణల లక్ష్యంకాదని ఉప ముఖ్యమంత్రిఅన్నారు. మొదటిబిల్లులో ఎట్టి మినహాయింపులు లేకుండెనన్నారు. కానికమతాలుమినహాయింపులుఆన్యోన్య అవిభాజ్యసంబంధంకలిగినవన్నారు ఉత్పత్తి దెబ్బతినకుండుటకు ఈ మినహాయింపులు చేయబడినవన్నారు. జాతీయాదాయం కుంటుబడకుండా చూచుట ప్రభుత్వ బాధ్యత కాబట్టి ఈ మినహాయింపులను ఖండించుటవల్ల ప్రయోజనముండబోదన్నారు. అందుకొరకే పండ్లతోటలు, చక్కెర ఫ్యాక్టరీల అధీనంలోఉన్న ఫారములకు, సమర్థవంతంగా నిర్వహింపబడుతున్న ఫారములకు కమతాలు నిర్ణయించలేదన్నారు. భూములపై ఎట్టి కమతాలను ఏర్పరచ గూడదని కమీషన్ మొదటి పంచవర్ష ప్రణాళిక కాలంలో భావించినదని శ్రీ జె రఘోత్తం రెడ్డి అన్నారు. కాని తర్వాత కమీషన్ తన అభిప్రాయాన్ని మార్చుకున్నదన్నారు. దేశం సుభిక్షం కావాలంటే సంపన్నులైన రైతులకిట్టి అంశాలు పనికిరావన్నారు.

కమతాలను ఎకరాల పరిధిలో నిర్ణయించినందులకు ప్రభుత్వాన్ని శ్రీమతి భారతీరంగా విమర్శించారు. సముచిత పరిహార మివ్వాలన్నారు. ప్రభుత్వ మీ బిల్లును ఉపసంహరించుకొని 1962 లో జరిగే సాధారణ ఎన్నికలలో దీనిపైన ప్రజాభిప్రాయాన్ని సేకరించాలన్నారు బిల్లులో మినహాయింపులను చేర్చినందులకు శ్రీ సి. హెచ్. సుబ్బారావు చౌదరి విమర్శించారు. చెరుకు తోటలు ఎందుకు మినహాయింపబడాలో తనకు ఆశ్చర్యంగా ఉన్నదన్నారు. ఈ బిల్లు బీదలను తృప్తి పరచుటకుగాక భూస్వాముల హక్కుల కాపాడుటకే ఏర్పడినదన్నారు. ఈ బిల్లువల్ల బీద రైతుల ఆశలు అడియాసలైనవని శ్రీ ఎ. గురువారెడ్డి అన్నారు. ఈ బిల్లు వల్ల సోషలిజం సాధింపబడదనీ, విద్యతో సహా ఇతర సౌకర్యాలను రైతులకు ప్రభుత్వం చేకూర్చాలని శ్రీ పి. శ్రీరామమూర్తి అన్నారు.

భూములపైనే కమతాల నేర్పరుస్తున్న ప్రభుత్వం ఇతర ఆదాయాలమీద ఎందుకేర్పాటు చేయుటలేదని ప్రభుత్వాన్ని శ్రీమతి కడప రామసుబ్బమ్మ ప్రశ్నించారు ఐదారు ధరల మేరకు నష్టపరిహారమివ్వాలని ఆమె కోరారు.

రాష్ట్ర శాసన మండలిలో నిన్న భూమిపరిమితి బిల్లుపై చర్చ కొనసాగినప్పుడు శ్రీ ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి (కమ్యూ) పరిమితి తగ్గించబడిందని రెవిన్యూమంత్రి అంటున్నా నిజానికి పరిమితి హెచ్చించబడిందన్నారు.

శ్రీ వెంపటి పురుషోత్తం (స్వ) ప్రజలలో అధిక సంఖ్యాకులు పరిమితి విధింపును వ్యతిరేకిస్తున్నారన్నారు శ్రీ రుద్రరాజు రామలింగరాజు (కాం) బిల్లును బలపరుస్తూ దీనిని ప్రతిపాదించినందుకు రెవెన్యూ మంత్రిని అభినందించారు శ్రీత్రిపురాన రాఘవదాస్ (స్వతంత్ర) వ్యవసాయ కమతాలపై పరిమితి ఎందుకు ఉండాలో అర్థంకావడం లేదన్నారు.

శ్రీ గుంటూరు భావనయ్య (కమ్యూ) దేశఅభివృద్ధి కార్యక్రమం జయంప్రదం కావాలంటే ఉత్పత్తిని అధికం చేయాలన్నారు. అందుకు పరిమితుల విధింపు అదనపు భూమిని బీదలకు పంచడం కూడ దోహదం చేస్తుంది

శ్రీ మద్దూరు సుబ్బారెడ్డి (కాంగ్రెసు) బిల్లును ఆహ్వానిస్తూ సోషలిస్టు సమాజ నిర్మాణమనే దేశ లక్ష్యానికిది ప్రథమ సోపానమన్నారు.

శ్రీ గడియారం వెంకట శేషశాస్త్రి (నామినేటెడ్) బిల్లును ఆహ్వానిస్తూ అవసరమైతే అనుభవాన్నిబట్టి దీన్ని సవరించుకోవచ్చునన్నారు.

నిన్నటి చర్చలో శ్రీ చీకటి పరశురాంనాయుడు (స్వతంత్ర) ఢిల్లీలో కూర్చునే వ్యవసాయేతరులు వ్యవసాయవర్గంపై పన్నిన కుట్రగా యీ బిల్లును వర్ణించారు.

శ్రీ ములుకుట్ల వెంకట శాస్త్రి (స్వతంత్ర) వచ్చే జనరల్ ఎన్నికల్లో ఎక్కువ ఓట్లను పొందడానికి పాలక పక్షం వారిఎత్తుఅనిబిల్లును వర్ణించారు. దీనివలన ఎవరికీ ఎట్టి ప్రయోజనమూ ఉండదన్నారు.

శ్రీ హెచ్.కె. షేర్వాని (నామినేటెడ్) బిల్లును బలపరుస్తూ పరిమితిని ఎకరాలపై విధించాలనడం చాల మంచి సూచనన్నారు.

శ్రీ ఎం.వి. కృష్ణారెడ్డి (స్వ) అధికోత్పత్తిసాధనకు ప్రభుత్వం సహకార సేద్యంపై ఎక్కువ ఆశలు పెట్టుకోరాదన్నారు.

రేడియో కార్యక్రమం

హైదరాబాద్-ఎ

405.4 మీ (740 కిలోసై)

ఆదివారం జులై 17

ఉ॥ 6-30 సుప్రభాత్, కార్యక్రమ వివరణ, 6-40 భక్తిరంజని (విజయవాడనుండి కేలే) 7-00 తె-వా, 7-15 అమరవాణి సంస్కృత కార్యక్రమము (విజయవాడనుండికేలే) 7-30 ధోందూశాస్త్రి కుష్తాపూర్‌కర్: రాగ్‌విభాన్ 7-45 సంగీత శిక్షణ, 8-00 ఆం-వా, 8-15 హిం-వా, 8-30 ఇండియన్ మార్ట్యూన్స్ 8-35 సుబద్ధనంగీత్ 8-45 పిల్లలకు కొత్తపాటలు (ఉర్దూ) 9-00 "బచ్చోంకేలియే" పిల్లలకు (ఉర్దూ) 9-30 పరిసార సమాప్తి.

మ॥ 12-30 చిత్రజగత్ 1-00 రంగవల్లి స్త్రీలకార్యక్రమము, ఈ సంస్థల్ని చూశారా? ఇందిరా సేవాసదన్-హైదరాబాద్, రేడియో నివేదిక, మీరు కోరిన పాటలు, ఇష్టాగోష్ఠి మంగళం 1-30 ప్రాదేశిక్ సుగమ్ సంగీత్ 1-50 తె-వా, 2-00 వినాయకరావ్ పట్వర్ధన్ 2-10 ఉ- వా, 2-20 బాలవినోదం, చిన్నపిల్లల కార్యక్రమము, రారండోయ్, శ్రావణ భాద్రపదాలు నాటిక పొట్టిబావ తూకపు రాళ్లవర్తకం, హాస్య రచన, పాట నేర్చుకోండి, అపి.ఇపి 3-00 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

సా॥6-00 స్థానికప్రకటనలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 "నగరవాణి" కర్నూల్ మంజరి సీరియల్ నాటిక (2), 7-00 తె- వా, 7-15 కన్నడశ్రోతలకు, లలిత సంగీత్ 7-30 నాటిక (హిందీ) 8-00 చిత్రసీమ 8-30 ధోందూశాస్త్రి కుష్తాపూర్‌కర్ 9-00 ఆం-వా, 9-15 ఉ-వా. 9-30 ఢిల్లీనుండి కేలే 9-55 ధోందూశాస్త్రి కుష్తాపూర్‌కర్ 10-00 లలిత సంగీత గోష్ఠి 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

హైదరాబాదు-బి

42.02 మీ (7110 కిలోసై)

ఉ॥ 6-30 హైద్రాబాద్ ఎ వలె, 8-45 బి.లక్ష్మీనాయుడు 9-30ప్రసార సమాప్తి.

30.86 మీ (9720 కిలోసై)

మ॥ 12-30 హైద్రాబాద్ ఎ వలె, 2-10 శాస్త్రీయసంగీతము 2-20 హైదరాబాద్ ఎ వలె, 3-00 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

60.12 మీ (4990 కిలోసై)

సా॥6-00 హైద్రాబాద్ ఎవలె 6-15 గ్రామస్థుల కార్యక్రమము, భక్తరామదాసు, నాటిక 7-00 తె-వా 7-15 గ్రామస్థుల కార్యక్రమం, ఫిల్మ్‌గీతం, అభ్యుదయవేదిక 7-30 బి. లక్ష్మీనాయుడు 8-00 హైదరాబాద్ ఎ వలె 9-15 ఎ.కె.సి నటరాజన్: క్లారినెట్ 9-30 హైదరాబాద్ ఎ వలె, 10-30 వాతావరణసూచన, ప్రసారసమాప్తి.

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉ॥ 6-30 శుభోదయం, 6-35 దేశభక్తిగేయము 6-40 భక్తిరంజని: 7-00 తె-వా, 7-15"అమరవాణి"సంస్కృత కార్యక్రమము 7-30 ఎ ఐ. ఆర్: వాద్యబృందము 7-45 సంగీత శిక్షణ 8-00 ఆం-వా, 8-15 హిం-వా, 8-30 పాలవెల్లి, చిన్నపిల్లల కార్యక్రమము 9-00 ప్రసార సమాప్తి.

మ॥ 12-30 శిష్టుప్రభాకర కృష్ణమూర్తిశాస్త్రి 1-00 జగ్గయ్యపేట ఖానిమ్‌సాహెబ్: వ్యాండు వాద్యం 1-30 లలిత సంగీతం 1-50 తె-వా, 2-00 ప్రసార సమాప్తి.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు 6-05 ప్రాంతీయవార్తలు, 6-15గ్రామస్థుల కార్యక్రమము, 7-00 తె-వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమము 7-30 ఉభయకుశలోపరి, శ్రోతలఉత్తరాలకు జవాబులు 7-40లలితసంగీతం; కల్లూరిశ్రీదేవి 8-00 అల్లు సత్యవతి; వయొలిన్ 9-00 ఆం-వా, 9-15 లలిత సంగీతం; కల్లూరి శ్రీదేవి 9-30 నేటి సమస్యలు 9-45 గానసుధ 10-00 శిష్టు ప్రభాకర కృష్ణమూర్తిశాస్త్రి 10-30 వాతావరణసూచన, ప్రసారసమాప్తి.

కార్మికులు క్రమశిక్షణతో మెలగాలి

కార్మికమంత్రి శ్రీ నూకల రామచంద్రారెడ్డి ఉద్బోధ

హైద్రాబాద్, జులై 14

కార్మిక-యజమానులు సుహృద్భావములను కలిగి క్రమశిక్షణతో మెలగవలసినదిగా ప్రతిఒక్కరికి నిన్న కార్మిక మంత్రి శ్రీనూకల రామచంద్రారెడ్డి విజ్ఞప్తి చేశారు:

సెక్రిటేరియట్ భవనములోని కమిటీ హాలులో జరిగిన వివిధ సంస్థల ప్రతినిధుల సమావేశములో ప్రసంగిస్తూ మంత్రి శ్రీ రామచంద్రారెడ్డి అన్యోన్య హక్కులను, లావాదేవీలను వాటి ప్రత్యేకతను గుర్తించవలసినదిగా వివరించారు. ఈసభకు రాష్ట్రం నుండి 60 మంది ప్రతినిధులు, లేబర్ కమీషనరు మేజర్ యస్ కె. గురుస్వామి, శ్రీయుతులు కె.ఎ.అన్సారి, సభ్యులు (అసిస్టెంట్ కమీషనర్లు), శ్రీ వై. యస్. రెడ్డి రిసెర్చి ఆఫీసరు మొదలగువారంతా హాజరయినారు.

శ్రీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ కార్మికులు ట్రేడ్ యూనియన్లు స్థాపించుకొనవచ్చుననీ, అయితే ఆసంస్థను తమ యజమానులు గుర్తించాలనీ, అటువంటి సంస్థలకు లాకౌట్‌ల వల్లగాని, ప్రతీకారచర్యలవల్లగాని ఏ విధమైన భయముకలగకుండ కార్మికులకు రక్షణ కల్పించాలన్నారు. కార్మికులపై జరిగే దౌర్జన్యాలను సహించరాదనీ తరువాత అకస్మాత్తుగా జరిగే సమ్మెలనుండి హింసాత్మకమైన చర్యలనుండి తదితర దౌర్జన్యాలనుండి కార్మికులకు రక్షణ కల్పించాలని కూడ ఆయన అన్నారు.

క్రమశిక్షణతో మెలిగే ప్రతికార్మికునికి ప్రభుత్వము సహాయము చేస్తుందనికూడ శ్రీ రామచంద్రారెడ్డి అన్నారు.

శ్రీ అమ్‌లోక్‌రామ్ (ఎ. పి. టి యు. సి) మాట్లాడుతూ యజమానుల అత్యధిక సంఖ్యగల యూనియన్లను గుర్తించాలనీ, హైకోర్టులకు, సుప్రీం కోర్టులకు పోకుండా ఈకోడ్‌నుఅమలు పరచాలని కోరారు. శ్రీ డబ్ల్యు వి రామారావు తాను హృదయపూర్వకముగా ఈకోడ్‌ను అంగీకరిస్తున్నామన్నారు.

శ్రీ మందపాటి నాగిరెడ్డి యం. యల్. ఏ. మాట్లాడుతూ కోడ్‌ను ప్రభుత్వము యజమానులచే ఆచరింపజేయించాలన్నారు.

లేబరు కమీషనరు శ్రీగురుస్వామి హాజరైన ప్రతినిధులకు తమ కృతజ్ఞతలను తెలియజేస్తూ యజమానులు-కార్మికులు ఈకోడ్‌ను అమలు పరచటానికి సహాయ భూతులు కావాలన్నారు

సంక్షిప్తవార్తలు

10 వేల మందికి నష్టం

కలకత్తా, జులై 15: ఇటీవల అస్సాంలో పర్యటించి అక్కడి కలతల్ని పరిశీలించిన కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ నీలం సంజీవరెడ్డి విలేఖరులతో మాట్లాడుతూ ఆ కలతల వలన సుమారు 10 వేలమంది-ముఖ్యముగా బెంగాలీయులు నష్టపడినారనీ వారి భవిష్యత్తు ఏమిటో తెలియకుండా ఉందనీ అన్నారు ఆకలతలవలన, లూటీల వలన చాలనష్టం సంభవించినదన్నారు.

రష్యాకు అమెరికా హెచ్చరిక

వాషింగ్‌టన్, జులై 15: మధ్య, దక్షిణ అమెరికా అంతర్గత వ్యవహారాలలో జోక్యము కలిగించుకోవద్దని అమెరికా నిన్న సోవియట్ యూనియన్‌కు తీవ్రమైన హెచ్చరిక చేసింది. విదేశాంగశాఖ ప్రెసిడెంట్ ఐసెన్‌హోవర్ ఆమోదముతో జారీచేసిన ఒక ప్రకటనలో మన్రో ఒప్పందము 150 సంవత్సరాల క్రితము కుదుర్చుకోబడినా అది యిప్పటికీ అమలు జరుగుతున్నదని పేర్కొనబడింది.

రష్యా అమెరికా చర్చలు

ఇటీవలి రష్యా చర్యలు, ప్రకటనల దృష్ట్యా విమాన ఒప్పందం గురించి సోమవారము యిక్కడ ప్రారంభం కావలసి యున్నరష్యా - సోవియట్ చర్చల్ని వాయిదా వేయాలని అమెరికా రష్యాని కోరింది. అనుకూలమైన సమయము వచ్చేవరకూ చర్చలు వాయిదా పడటము మంచిదని సూచించబడింది.

ప్రధాని అస్సాం పర్యటన

న్యూఢిల్లీ, జులై 15: ప్రధాని నెహ్రూ మూడురోజులపాటు అస్సాంలో పర్యటించే నిమిత్తము జులై 17న బయలు దేరి వెడుతున్నారు. ఆయన కలత ప్రాంతాలలో పర్యటించి జులై 20న తిరిగి వస్తారు. శ్రీమతి ఇందిరాగాంధీకూడ ఆయనవెంట అస్సాం వెళ్ళి అస్సాంలోని కొన్ని ప్రాంతాలలో ప్రత్యేకముగా పర్యటిస్తారు.

బ్రహ్మపుత్ర వరదలు

దిబ్రుగర్, జులై 15: బ్రహ్మపుత్రా నది వరదలకు ఉత్తర అస్సాంలోని లగింపూర్ జిల్లాలో - ముఖ్యముగా దిబ్రుగర్ సబ్‌డివిజన్‌లో అనేక గ్రామాలు మునిగి పోయినవి. బ్రహ్మపుత్రానది, ఉపనదుల కట్టలు చాలచోట్ల తెగిపోయి పంట భూములు మునిగి పోయినవి.

సహచరుడుగా ప్రత్యర్థి ఉండాలని కెన్నెడీ నిర్ణయం

లాస్ ఏంజల్స్, జులై 15: అమెరికా అధ్యక్ష పదవికి డెమోక్రటిక్ పార్టీ టికెట్‌పై పోటీచేయడానికి జరిగిన ఎన్నికలలో తనతో ఓడిపోయిన సెనేటర్ జాన్ లైండన్‌జాన్సన్ ఉపాధ్యక్ష పదవికి తనతోకలసి పోటీచేయాలని అధ్యక్ష పదవికి అభ్యర్థిగా గెలుపొందిన సెనేటర్ జాన్ కెన్నెడీ నేడు ప్రకటించారు.

డెమోక్రాటిక్ పార్టీ ఎన్నిక

అధ్యక్ష అభ్యర్థి కెన్నెడీ పేర్కొన్న సెనేటర్ జాన్సన్‌ను ఉపాధ్యక్ష పదవికి పోటీచేసే డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిగా డెమోక్రటిక్ పార్టీ మహాసభ ఎన్నుకొన్నది.

కేంద్ర ఉద్యోగులు; సాధారణ సమ్మె

న్యూఢిల్లీ, జులై 15

కేంద్ర ఉద్యోగుల సమ్మెకు సానుభూతి సూచనగా నిన్న దేశవ్యాప్తంగా ఒకరోజుసమ్మెను జరుపుటకు ఇవ్వబడిన పిలుపువల్ల ఒక కలకత్తాలోమాత్రం సాధారణజీవితంపైకొంతప్రభావం పడినది. బొంబాయిలో ఏదో స్వల్ప సంఘటనలు మినహా ఈ సాధారణ సమ్మె ఎట్టి ప్రభావాన్ని కలిగింప లేకపోయినది.

అహ్మదాబాద్ సమీపంలో సబర్‌మతివద్ద ఒక రైలు ఇంజను పట్టాలు తప్పి దానికి కాపలాగా ఉన్న ఇద్దరు పోలీసులకు స్వల్పగాయాలు తగిలినవి.

బొంబాయి కలకత్తా మరికొన్ని స్థలాలలో మినహా దేశవ్యాప్తంగా సమ్మెపరిస్థితి మెరుగయినది.

వాణిజ్యవ్యవహారాలు

మెసర్స్ కల్వసూర్యనారాయణ

మర్చంట్ అండ్ కమీషన్ ఏజంట్
ఉస్మాన్‌గంజ్-హైద్రాబాదు
ఫోన్ నెం 4412

హైద్రాబాద్, జులై 15

(వల్లా ఒక్కంటికి 120 శేర్లు)

నానకరాంలు	69-0-0	72-0-0
గర్కలు	58-0-0	62-0-0
పాలక్కులు	64-8-0	67-0-0
24 నంబర్లు	73-0-0	76-0-0
బంగారుతీగెలు	72-0-0	74-0-0
గుజ్జులు	69-0-0	70-8-0
గొట్టెబియ్యం	55-0-0	57-8-0
కుసుమబియ్యం	65-0-0	67-0-0
దొడ్డు బియ్యం	61-0-0	64 8-0
నెంబర్లు ॥	63-0-0	67-8-0
సాంబర్లు ॥		
కొత్తసాంబర్లు	73-0-0	79-8-0
మాకలు	42-0-0	61-0-0
వరంగల్ సాం. ॥		
బన్సీగోధుమలు	70-0-0	78-0-0
కుస్మలు	63-0-0	67-0-0
కందులుపెద్దవి కొ॥	53-0-0	56-8-0
కందులుచిన్నవి కొ॥	47-0-0	49-0-0
మినుములు	55-0-0	57-8 0
సెనగలు	48-8-0	49-4-0
బెల్లం	56-0-0	65-0-0
పెసర్లు కొ॥	50-0-0	55-0-0
తెల్లకొన్నలు	50-0-0	53-0-0
పచ్చకొన్నలు	46-8-0	47-8-0
మిరపకాయలు	280-0-0	270-0-0
పసుపు	125-0-0	130-0-0
ఉల్లిగడ్డ కొ॥	11-0-0	14-8-0
చింతపండు కొ॥	84-0-0	114-0-0
నల్లవులువలు	39-0-0	40-8-0
తెల్లనువ్వులు	130-0-0	140-0-0
సర్దలు	44-0-0	46-0-0
పెద్ద కందిపప్పు	74-0-0	78-0-0
చిన్న కందిపప్పు	65-0-0	69-0-0
సెనగపప్పు	59-0-0	60-8-0
పెసరపప్పు	73-0-0	76-0-0
మిరుపపప్పు	76-0-0	77-8-0
ఆముదాలు	76-0-0	77-4-0
లంకపిండి	51-0-0	53-0-0
ఇలాతిదాన చి॥	69-0-0	76-0-0
యెర్రనువ్వులు	112-0-0	118-0-0
యెర్రబొబ్బర్లు	52-0-0	54-0-0

(12 శేర్ల మణుగు)

అల్లం	8-0-0	10-0-0
యెల్లిగడ్డ	4-0-0	6-8-0
పల్కుమానె	22-0-0	23-4-0
ఆలుగడ్డ	4-6-0	4-8-0

(16 శేర్ల మణుగు)

ధనియాలు	28-0-0	21-4-0

ఈప్రకారము యీరోజు అయిన ధరలు వ్రాయించాము గిట్టిన సరుకుబంపవచ్చును; తెప్పించుకోవచ్చును.

వెండి బంగారు ధరలు

సముద్రాల రాఘవులు గారి చంద్రయ్య దుకాణం

సిద్దంబర్ బజార్, ఫోన్ నెం. 4890

హైద్రాబాద్, జులై 15

బంగారం	130-12-0
ఆర్నోక్ లీఫ్	181-0-0
సవరన్	87-0-0
వెండి 100 తు॥	218-0-0
చిల్లర తు॥ 1 కి	2-8-6

అరణియార్ ప్రాజెక్టు నీటి పంపిణీ

ఆంధ్ర-మద్రాసు ప్రభుత్వాల మధ్య ఒప్పందం

హైద్రాబాద్, జులై 15

పటాస్కర్ తీర్పు ప్రకారం యిటీవల ఆంధ్ర-మద్రాసుల సరిహద్దుల మార్పిడి జరిగిన ఫలితంగా ఆంధ్ర ప్రభుత్వానికి స్వాధీన పరచబడిన అరణియార్ ప్రాజక్టుకు సంబంధించిన అంశాలపై ఆంధ్ర ప్రదేశ్, మద్రాసు ప్రభుత్వాల మధ్య నేడు ఒప్పందం కుదిరింది.

మద్రాసు హోంమంత్రి శ్రీ ఎం. భక్తవత్సలంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ సంజీవయ్య. పబ్లిక్ వర్క్సు మంత్రి శ్రీ అల్లూరి సత్యనారాయణ రాజు, ఆర్థిక మంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి (అంతర రాష్ట్రీయ మంత్రుల) రెండురోజుల చర్చల ఫలితంగా యీ ఒప్పందం కుదిరింది.

నేడు విడుదల చేయబడిన ఒక అధికార ప్రకటనలో ఒప్పందాన్నిగురించి యిలా ఉంది:

(1) ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 15 నుండి జనవరి 15 వరకూ గల కాలంలో మద్రాసు ప్రాంతానికి రిజర్వాయిర్ నుండి 100 కోట్ల క్యూబిక్ అడుగుల నీటిని విడుదల చేయాలి. (2) అయితే రిజర్వాయిర్ శక్తి 40 కోట్ల క్యూబిక్ అడుగులకు మించి లేకుంటే రిజర్వాయిర్ నుండి ఆంధ్ర ప్రదేశ్, మద్రాసులకు నీటిని విడుదలచేసే ప్రశ్నను తదనుగుణంగా క్రమపరచాలి (3) రిజర్వాయిర్‌లో తగినంత నీరుంటే ఆంధ్ర ప్రదేశ్‌లో రెండో పంటకు నీటిని విడుదల చేయడానికి ప్రాధాన్యం యిచ్చి, మిగిలిన నీటిని మద్రాసులో రెండో పంటకు విడుదల చేయాలి (4) ప్రాజక్టు ఖర్చు నీటి విని యోగాన్ని బట్టి రెండు రాష్ట్రాలమధ్య పంపిణీ చేయబడుతుంది. (5) ఇప్పటినుండి 10 ఏండ్లు యీ ఒప్పందాన్ని అమలు జరపడములో ఏమైనా యిబ్బందులు వస్తే ఉభయ ప్రభుత్వాల పరస్పరామోదంపై మార్పు చేసుకోవచ్చు.

ముఖ్యమంత్రికి కౌన్సిల్‌లోని ప్రతిపక్షనాయకుని ఫిర్యాదు

హైద్రాబాద్, జులై 15

విచక్షణ రహిత అరెస్టులు, మధ్యరాత్రి కార్యకర్తల యిండ్లపై దాడి చేయుట లాకప్‌లోఉన్న నిర్భాగ్యులకు ఆహారమివ్వకపోవుట వంటి మితిమీరిన చర్యలు పోలీసులు చేస్తున్నారని ముఖ్యమంత్రి శ్రీ డి.సంజీవయ్యకు కౌన్సిల్‌లోని ప్రతిపక్షనాయకుడు శ్రీ మక్దుమ్ మొహియొద్దీన్ తెలిపారు. పోలీసు ప్రవర్తనవల్ల యేర్పడే ఉద్రిక్తతను తగ్గించడానికి పోలీసు నిర్బంధంలోవున్న ట్రేడ్‌యూనియన్ నాయకులను విడుదల చేయాలని సూచించారు.

ఈవిషయాన్నిపరిశీలించి తగుచర్య గైకొంటానని ముఖ్యమంత్రి మక్దుమ్ మొహియొద్దీన్‌కు తెలిపారు.

కమ్యూనిస్టుపార్టీకి రాజీనామా

భానాపురం, జులై 15

మెదక్ జిల్లా సిద్దిపేట తాలూకా భానాపురం గ్రామపంచాయత్ కమిటీ అధ్యక్షుడు శ్రీ కె. మ

14 వ సంయుక్త వారము
గురుదత్స్
చౌధ్వీ కా చాంద్
ప్రభాత్ హైదరాబాద్.
ఆటలు: 3-15, 6-30, 9-30 గం॥
అలంకార్ సికింద్రాబాద్.
ఆటలు: 3-30, 6-30, 9-30 గం॥
హెచ్చు తరగతులకు
అడ్వాన్సు బుకింగ్.
జ్యోతి డిస్ట్రిబ్యూటర్స్ విడుదల.
(Trupix)

9 వ సంయుక్త వారం
రమల్ అమ్రోహిస్
దిల్ అప్నా
ఔర్
ప్రీత్ పరాయి

రాయల్
హైదరాబాద్
నేడు 3 ఆటలు: 3-15, 6-15, 9-30.
హెచ్చు తరగతులకు అడ్వాన్సు బుకింగ్.
శ్రీ సినీ కార్పొరేషన్ రిలీజ్.
(Trupix)

వృత్తులు మార్చుటవలన ప్రయోజనమేమీ లేదు

ఒంగోలులో శ్రీశృంగేరి పీఠాధిపతుల ఉద్బోధ

(మా విలేఖరి)

ఒంగోలు, జులై 15

"దేశములోని ప్రజలలో ఎక్కువ భాగమువారి వృత్తులు, తమ జన్మ సమయములందే, వంశ పారంపర్యముగ నిర్ణయింపబడును. కాని కొన్ని సమయములందు వారు తమతమ వృత్తులు మార్చుకొనుటవలన ప్రయోజన మేమీ లేదు." అని ఒంగోలు పట్టణమున శ్రీ అభినవవిద్యాతీర్థస్వాముల వారు ఉద్ఘాటించిరి.

శ్రీ విద్యా తీర్థ స్వాములవారు (శ్రీ శృంగేరీ పీఠాధిపతులు) సోమవారం రాత్రి ఒంగోలు పట్టణమున కరుదెంచిరి. శ్రీ స్వాములవారికి, వారి రాక సమయమున పురపాలకసంఘము తరపున శ్రీ వరదా నారాయణరావు (మునిసిపల్ ఛెయిర్మన్) యితర కౌన్సిలర్లు, పట్టణ ప్రజల తరపున పలువురు భక్తులు ఘనస్వాగతమిచ్చిరి.

స్థానిక పి. వి. ఆర్. యం. యస్. స్కూలు నందు యేర్పరచబడిన సభకు వేలకొలది ప్రజలు విచ్చేసిరి. ఈసభలో పట్టణ ప్రజల తరపున శ్రీ వావిలాల వెంకటేశ్వరశాస్త్రి సంస్కృతసన్మాన పత్రము సమర్పించిరి.

పురపాలక సంఘము స్వాముల వారికి జరిపిన పౌరసన్మానమునందు శ్రీ డా॥ చెరువు రామకృష్ణ (పురపాలక సంఘ ఉపాధ్యక్షులు) సన్మాన పత్రము చదివి సమర్పించిరి.

శ్రీ శృంగేరి పీఠాధిపతులు స్వాగతమునకు సంతోషించి సన్మాన పత్రములకు సమాధానముగా ఇంకాఇలా చెప్పారు:

"జీవితంలో ప్రతి యొక్క మానవుడు సుఖమునే అన్వేషించుచుండును. కాని పాలసముద్రమువద్దనుండే అవుపాలు ఎలా ఉపయోగించుకొనరో, ఆవిధముగానే స్వయాపానందంపొందిన వ్యక్తికిసుఖమునిరుపయోగము. జీవిత యాత్రిలో నడచుటకు మానవులకు ఒక సాధారణ బండికిఉండే రెండుచక్రములవలె దైవకృప, పురుషకారము, అనివార్యమయిన విషయములు. ఇవి లోపించినచో చక్రములేని బండివలె జీవితము నడుపవలసివచ్చును.

పురుషకారము సఫలత పొందవలెనంటే దైవకృప అవసరము ఎంతయినా ఉంటుంది. జీవితములో మానవు లందరూ తమతమ వృత్తులయందు (1 వ పేజి తరువాయి)

బేగంపేట విమానాశ్రయంలో ఇవాళ కూడా ఆదనంగా మరికొంత మంది ఉద్యోగులు పనిలోకి వచ్చి చేరారు సమ్మె సాగించాలా? వద్దా అని సమ్మెదారులలో అనేకమంది సందిగ్ధావస్థలోపడితటపటాయిస్తున్నట్లు అధికార రీత్యా ప్రకటించబడింది. సమ్మె చేస్తున్న ఉద్యోగుల ముఖ్య నాయకుల్ని అయిదుగుర్ని ఇంతవరకూ అరెస్టుచేశారు. 40 మంది శాశ్వతులి కోద్యోగులను సర్వీసునుండి తొలగించబోతున్నట్లు నోటీసులు జారీచేశారు.

విమానాల రాకపోకలు ఇవాళ కూడా యథాప్రకారంగా సాగాయి.

పోస్టు, టెలిగ్రాఫ్స్ పరిస్థితి

ఆంధ్రప్రదేశ్ పోస్టుమాస్టరు జనరలు సర్కిలులో ఇవాళ, సమ్మె ప్రారంభమైన నాలుగో రోజున, నిన్నటి మోస్తరుగానే పరిస్థితిలో సర్వతోముఖమైన అభివృద్ధి కన్పించినట్లు పోస్టుమాస్టరు జనరలు జారీ చేసిన పత్రికా ప్రకటనద్వారా తెలుస్తున్నది.

ఇవాళ ఉదయం 6 గంటలకు మొత్తం 11,729 మంది సిబ్బందిలో 8,552 మంది పనిలోకి వచ్చారు. 3,177 మంది సమ్మె చేస్తున్నారు దరిమిలాను కూడా అదనంగా అనేకమంది ఉద్యోగులు పనిలో చేరారనీ, వారి సంఖ్య పై లెక్కలో చేరలేదనీ, ఆ ప్రకటనలో వెల్లడించబడింది.

నిన్న 662పోస్టాఫీసులు పనిచేయగా, ఇవాళ 752 పోస్టాఫీసులు పనిచేశాయి. నిన్న 299 పోస్టాఫీసులు పనిచేయలేదు ఇవాళ పనిచేయని పోస్టాఫీసుల సంఖ్య 60 మాత్రమే. నిన్న 22 పోస్టాఫీసులను గురించిన సమాచారం ఇదమిత్థంగా తెలియలేదు. ఇవాళ అలా సమాచారం తెలియని పోస్టాఫీసుల సంఖ్య 13.

ఆర్. ఎం ఎస్. కు సంబంధించి పరిస్థితిలో మార్పేమిలేదు. మద్రాసు కుర్దారోడ్డు ఆర్. ఎమ్ ఎస్. ను తెరవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. రేపటికి పరిస్థితి మెరుగవుతుందని ఆశించబడుతోంది.

నిన్న పనిచేసిన తంతి కార్యాలయాలు యీవాళకూడా పనిచేస్తున్నాయి. సాధారణ టెలిగ్రాములు పట్టడం ప్రారంభించారు. టెలిఫోను ఎక్స్ఛేంజీలకు సంబంధించికూడా ఇదే పరిస్థితి.

సమ్మె చేస్తున్నవారిలో శాశ్వతిక ఉద్యోగులను తొలగించగా ఏర్పడిన ఖాళీలలో ఎక్కా ఎకిన అభ్యర్థులను నియమించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. కొత్తగా చేరిన వారికి తర్ఫీదు యిచ్చి, సమ్మెచేస్తున్న వారి స్థానాలను శాశ్వత ప్రాతిపదికపై భర్తీ చేయడానికి త్వరితంగా ఉత్తర్వులు జారీచేయబడుతున్నాయి.

బియ్యం ఎగుమతుల కోటా హెచ్చింపు

హైదరాబాద్, జులై 15

మన రాష్ట్రంనుంచి దక్షిణ ఆహార మండలం వెలుపలి ప్రదేశాలకు ఉప్పుడు, దంపుడు బియ్యం ఎగుమతులను పెంచవలసి వచ్చినందువల్ల, ఈ రాష్ట్రానికి కేటాయించబడిన నెలసరి ఎగుమతి కోటాను 100 టన్నుల నుంచి 300 టన్నులకు హెచ్చించడానికి భారత ప్రభుత్వం అంగీకరించింది. ఈ కోటాను, రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు దిగువ విధంగా కేటాయించడానికి ప్రభుత్వం ఆదేశించింది.

1. కడప 15 టన్నులు, 2. చిత్తూరు 15 టన్నులు, 3. కర్నూలు 15 టన్నులు, 4. కరీంనగరం 15 టన్నులు 5. వరంగల్ 15 టన్నులు, 6. నల్లగొండ 15 టన్నులు, 7. మెదక్ 20 టన్నులు, 8. అనంతపురం 40టన్నులు 9. నిజామాబాద్ 40 టన్నులు, 10. కృష్ణా 35 టన్నులు, 11. గుంటూరు 30 టన్నులు, 12. నెల్లూరు 25 టన్నులు 13. హైదరాబాద్ 20 టన్నులు.

తమ తమ జిల్లాలకు కేటాయించబడిన కోటాలను విలునుబట్టి, బియ్యం వర్తకులకు పంచవలసిందిగా ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను కోరింది. ఈ విధంగా జరుగు పంపిణీ పెద్ద వర్తకులు, ఇతరులకు మధ్య 201 నిష్పత్తిలో వుండాలని ప్రభుత్వం తెలిపింది.

రైల్వే ఆఫీసులు, స్టేషన్‌లముందు పికెటింగు

హైదరాబాదు, జులై 15

సికింద్రాబాద్ డివిజన్ నేషనల్ రైల్వే మజ్దూర్ యూనియన్ చర్యా సమితి నేడు సమావేశమై రైల్వే పనివారలపై పోలీసు జులుం తగ్గనిచో రేపటినుండి రైల్వే ఆఫీసులు స్టేషనుల ముందు పికెటింగు చేయ నిర్ణయించినది.

హోచిమిన్ తిరిగి ఎన్నిక

హాంకాంగ్, జులై 15

ఉత్తర వియత్‌నామ్ అధ్యక్షునిగా డాక్టర్ హోచిమిన్‌ను ఆదేశ శాసన సభ తిరిగి ఎన్నుకున్నది.

శాసన మండలిచే కార్పొరేషన్‌ల బిల్లు ఆమోదం

హైదరాబాదు, జులై 15

జంటనగరాల మున్సిపల్ కార్పొరేషన్‌ల లీనీకరణబిల్లును శాసనమండలి ఆమోదించినది.

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకమతాల గరిష్ఠపరిమితి బిల్లులో 5 నుండి 14 క్లాజులను నేడు రాష్ట్ర శాసనమండలి ఆమోదించినది.

స్వతంత్ర కమ్యూనిస్టు పార్టీల సభ్యులు దీనికి ప్రతిపాదించినసవరణలు వీగిపోయినవి.

శాసన మండలి నేడు ప్లానింగు మంత్రి పి. రంగారెడ్డి ప్రతిపాదించిన హైదరాబాదు గ్రామ పంచాయతీల బిల్లును ఆమోదించినది.

కౌలుదార్ల, రైతుల రక్షణ బిల్లు

గడువు పొడిగింపు

హైదరాబాదు, జులై 15

మద్రాసు కౌలుదార్ల - రైతుల రక్షణ బిల్లును (ఆంధ్రప్రదేశ్ సవరణ 1960) నేడు రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించినది. అబిల్లును 1961 అక్టోబర్ 7-వ తేదీ వరకు పొడిగించుటే ఈ బిల్లులక్ష్యం. మొదటఈబిల్లును రెండేండ్లకు పొడిగించాలన్న ప్రతిపాదనకు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య తెచ్చిన ఈ సవరణను ప్రభుత్వము ఆమోదించినది. మద్రాసు ఎస్టేట్సు రద్దు చట్టం 1948 ప్రకారం ఇంకా కొన్ని ఎస్టేట్లను ప్రభుత్వం యింకా తీసుకోలేదు కాబట్టి ఈసవరణ గడువు పొడిగింపు అవసరమైనదనిఉపముఖ్యమంత్రి శ్రీ కె.వి.రంగారెడ్డిఅన్నారు. ఈ గడువును అరునెలల వరకు తగ్గించాలని ప్రతిపక్ష నాయకుడు శ్రీ పి. సుందరయ్య అన్నారు.

ఇండియా-సోవియట్ పెట్రోలియం సరుకులు

కొత్తఢిల్లీ, జులై 15

అమెరికా బ్రిటన్ ఆయిల్ కంపెనీలు సరఫరాచేస్తున్న ధరలకన్నా తక్కువ ధరలకు కిరోసిన్ డిసెల్ ఆయిల్ లాంటి పెట్రోలియం ఉత్పత్తుల భారత దేశానికి రష్యా దిగుమతి చేయనున్నది. ఈసంబంధంగా ఉభయ ప్రభుత్వాలమధ్య ఒక ఒప్పందముపై సంతకాలు చేయబడినవి. 1960 ఆగస్టులో సోవియట్ పెట్రోలియం ఉత్పత్తుల తొలిభాగం చేరవేయబడగలదు.

యువజన సంక్షేమ సంస్థ (యూత్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్), హైదరాబాద్ ఆధ్వర్యమున దివి. 16-7-60 సాయంత్రం 6-30 గంటలకు బొగ్గులకుంటలోని థియాసఫికల్ సొసైటీ హాల్‌నందు "ఆంధ్రప్రదేశ్‌లో మతోన్మాద జాతీయ విద్రోహకర శక్తుల విజృంభణ ఫలితాలు" అను విషయంపై నగరంలోని వివిధ వర్గాలకు చెందిన ప్రముఖ వ్యక్తుల నాయకుల ప్రసంగాలు ఒక సింపోజియం రూపంలో ఏర్పరచబడినవి.

టోస్ట్‌మాస్టర్స్ క్లబ్

వై. ఎం. సి. ఎ. ఆధ్వర్యంలో నగరంలో స్థాపన

హైదరాబాదు, జులై 15

యువకులలోని నాయకత్వపు లక్షణాలను పోషించి బహిరంగ ఉపన్యాస ధోరణిని పెంపొందించుటకు శిక్షణ నొసంగు అంతర్జాతీయ సంస్థ వై. ఎం. సి. ఏ, ఆధ్వర్యమున నడపబడు "టోస్టుమాస్టర్స్" క్లబ్, సభాకంపంలేకుండాఆత్మధైర్యంతో శ్రోతల కభిముఖంగానిలిచిధారాళంగా ఉపన్యసించు నటుల సభ్యులను తయారు చేయుటకు ఇది ఉద్దేశింపబడినది.

మన హైదరాబాదు నగరములోది. 16, జూన్ 1960 నాడు అమెరికాలోని ఇతర ఇట్టి క్లబ్బులతో పరిచయమున్న ప్రొఫేసర్ శ్రీ పి. వి. రాజగోపాల్‌గారి ద్వారా వై. ఎం. సి. ఏ, ఆవరణలో ఈక్లబ్బుకు ప్రారంభోత్సవము జరిగినది. నాటి నుండి ప్రతి గురువారం 6-30 గంటలకు వై. ఎం. సి. ఏ. ఆవరణలో సమావేశములు జరుపుటకు నిశ్చయమైనది.

క్లబ్బు అధ్యక్షుల, అధ్యక్షతలో మౌన ప్రార్థనతో ప్రారంభమై రెండు నిమిషాలు ప్రతిసభ్యుడూతప్పనిసరిగా మాట్లాడిన తరువాత ఎవరో ఒక మహావ్యక్తి పేరిట "టోస్టు" ప్రతిపాదింపబడి, తేనీటి విందుపై తక్కిన కార్యక్రమం ఆరంభమవుతుంది. క్లబ్బు అధ్యక్షులనుండి ఆ దివసపు సమావేశకర్త పీఠం గ్రహించడం తరువాత వెంటనే గతవారంలో జరిగిన ప్రపంచపు ప్రముఖ శుభవార్తలను సమీక్షిస్తారు. తరువాత అధ్యక్షులు ఇరువురు విమర్శకులను ఎంచుకొంటారు. "15" నిమిషాలవరకు ఆ దివసపు ముఖ్యవక్త ఒక నిర్ణీత విషయంమై ఉపన్యసించిన తరువాత, ఈ ఇరువురువిమర్శకులూ "వక్త" యొక్క ఉపన్యాసధోరణిని, భావభావేచ్ఛలను విమర్శించి తమ సలహాలనిస్తారు. అదే విషయంపై ఇతర సభ్యులు రెండు, మూడు నిమిషాలవరకూ మాట్లాడవచ్చును. ముఖ్య ఉపన్యాసకుడికిమళ్ళీ ఒకసారి అవకాశం ఇవ్వబడుతుంది. చివరకు అధ్యక్షుడు నాలుగు మాటలు చెప్పితరువాత క్లబ్బు కార్యదర్శి కృతజ్ఞతాభివందన సమర్పణతో సమావేశం ముగుస్తుంది.

నగరంలోని ఈ క్లబ్బు దినదినం క్రొత్త సభ్యులతో వృద్ధిచెందుతోంది. విద్యార్థులనుండి ఉత్సాహం కనబడుతోంది. ఈ క్లబ్బుసభ్యత్వం మాత్రం ఒక పరిమితిలో ఉంటుంది. ఉత్సాహవంతులు యువకులు త్వరలో సభ్యులుగా చేరవచ్చును. ఈ దిగువవారు ఈ సంవత్సరపు కార్యవర్గంగా ఎన్నికైనారు.

శ్రీ జి. రాజేశ్వర్ రావు అధ్యక్షులు, శ్రీ ప్రహ్లాద అవధాని కార్యదర్శి, శ్రీ జార్జి జేకబ్ ఉత్సవాధికారి, తక్కిన వివరాలు హైదరాబాద్ వై. ఎమ్. సి. ఏ. కార్యదర్శి నుండి గైకొనవలయును.

డాక్టర్ ఎ. ఎస్. ఖోస్లా

న్యూఢిల్లీ, జులై 15

డాక్టర్ ఎ. ఎస్. ఖోస్లా వైర్‌మెన్‌గా ప్లానింగ్ కమిషన్ హెల్త్ పేనల్‌ను పునర్ నిర్మించినది. దీనిలో శ్రీ ఖోస్లాకాక 33 మంది సభ్యులుంటారు.

అమ్మకం ప్రకటన

— మా సిటీ గోదాములలో ఒకసారి ఉపయోగించివున్నట్టి చక్కెర గోనె సంచులు సుమారు 6000 లు కొనుటకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. ఏ కారణముచూపక టెండర్లను అంగీకరించుట లేక నిరాకరించుటకు మేము హక్కు కలిగియున్నాము. టెండర్లు 20-7-1960 బుధవారం సా॥ 3-00 గం॥ అంగీకరించబడును.

సేల్స్ ఆఫీసర్,
నిజాం సుగర్ ఫ్యాక్టరీ లిమిటెడ్.,
ఫతేమైదాన్‌రోడ్, హైదరాబాద్-దక్కన్.

1960-61 సం॥ అబ్కారి దుకాణముల వార్షిక వేలము
(సాలానా హరాజు)
ప్రకటన

ఉత్తర, దక్షిణ, ఉభయ హైదరాబాద్ జిల్లాల అబ్కారి మొహితిమీం ఆఫీసు-
నారాయణగూడా- హైదరాబాద్
ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్.

1960-61 (1370 ఫసలీ) సంవత్సరము కల్లు దేశీయసారా నారాయణగూడాలో తయారుకాబడు విదేశీసారా మరియు డిసేచర్డుస్పిరిటు, దుకాణముల పాటలు. (సాలానా హరాజు) ఆగస్టు 4 నుండి ఆగస్టు 7 వ తేదీ 1960 వరకు నారాయణగూడా లోని హైదరాబాద్ దక్షిణ జిల్లా మొహితిమీం ఆఫీసు ఆవరణములో జరుగును.

దుకాణములకొరకు నిర్ణయింపబడిన చెట్లు, సారా రేషన్ మొదలగు వివరములను పాటదారులు ఈ దిగువ ఆఫీసులనుండి తెలుసుకొనవచ్చును.

సయ్యద్ అబ్దుల్ హమీద్ రజ్వి
మొహితిమీం అబ్కారి,
హైదరాబాద్ దక్షిణజిల్లా
నారాయణగూడా.

సి. గజేంద్రసింగ్ బి. యస్. సి.
మొహితిమీం అబ్కారి,
హైదరాబాద్ ఉత్తరజిల్లా
నారాయణగూడా.

Edited Printed and Published by N. NarothamReddy M. A. for the Golkonda Publications Ltd at the Golkonda printing Press Hyderabad A. P.

రాకపోకలు

ఉపముఖ్యమంత్రి శ్రీ కె.వి.రంగారెడ్డి జులై 20వ తేదీ ఉదయం 8గంటలకు బయలుదేరి ఆలేరు వెడతారు. అక్కడనుంచి నగరం, వర్ధమానకోట, సూర్యాపేట, వర్యటించి జులై 21 వ తేదీ రాత్రి 11 గంటలకు రాజధానికి తిరిగి వస్తారు

ఆహార,వ్యవసాయ,కార్మిక శాఖా మంత్రి శ్రీఎన్.రామచంద్రారెడ్డి జులై 20 వ తేదీ ఉదయం బయలుదేరి సదాశివపేటమార్గంగా నిజాంపూర్ గ్రామం (మెదక్ జిల్లా) వెళ్ళి అదేరోజు మధ్యాహ్నము హైదరాబాదుకు తిరిగివస్తారు

కోఆపరేటివ్ సంస్థ పరీక్షా ఫలితాలు

హైదరాబాద్, జులై 15

1959 సెప్టెంబరులో జరిగిన ఆంధ్ర కేంద్రసహకార సంస్థపరీక్షలలో నెగ్గిన వారినంబర్లు ఇక్కడ ఇవ్వబడుతున్నవి

ఆడిటింగ్

ద్వితీయ: 2 6 10 15 నుంచి 17 24 25 27 నుంచి 35 37 39 నుంచి 43 52 53 55 56 58 59 61 62 65 66 72 74 76 79 81 87 94 96 102 నుంచి 4 6 8 19 26 31 32 35 41 42 46 59 61 64 67 75 76 77 92 203 10 12 20 28 34 35 41 44 48 49 51 53 54 56 57 59 నుంచి 65 67 70 నుంచి 73 75 75-బి 75-సి 75-డి 81 84 90 91 97 నుంచి 99 316 17 21 26 31 52 నుంచి 54 61 62 69 నుంచి 71 76 77 79 82 85 87 99 402 7 14 17 నుంచి 19 21 22.

బ్యాంకింగ్

ద్వితీయ: 13 16 18 23 25 31 37 38 52 55 56 58 59 62 66 76 నుంచి 78 91 93 94 99 నుంచి 102 5 6 19 25 26 30 31 35 37 42 60 61 76 92 203 13 30 31 34 35 37 41 42 49 51 54 56 57 59 నుంచి 264 67 85 నుంచి 287 89 91 99 306 10 11 21 26 27 38 44 47 54 55 67 76 88 400 2 4 11 14 16 20.

బుక్ కీపింగ్

ద్వితీయ: 18 31 37 38 39 44 నుంచి 46 51 54 62 63 65 66 69 నుంచి 71 78 80 83 98 102 5 6 8 11 12 14 15 17 నుంచి 119 25 26 32 33 38 42 43 45 46 48 53 55 57 160 నుంచి 163 66 72 73 76 77 180నుంచి 185 88 96 202 4 6 9 16నుంచి 218 20 21 26 34 37 41 49 51 53నుంచి255 57 259 నుంచి 265 67 93 94 98 302 3 13 14 23 327నుంచి 330 43 46 48 51 59 61 63 65 66 70 76 81 96 402 6 11.

కోఆపరేషన్

ద్వితీయ: 1 2 15 16 17 22 24 27 29 31 39 40 41 55 57 58 59 62 65 66 68 76 81 87 91 103 06 08 19 25 26 31 33 34 35 36 41 42 46 61 62 77 92 220 28 34 36 48 49 51 53 60 62 63 65 67 82 85 91 93 95 99 303 05 10 21 26 27 28 35 37 47 53 64 65 68 69 75 76 82 85 402 03 05 14 19.

నిమగ్నులై సేవా దృష్టితో కర్తవ్య పరాయణులుగా రూపొంద వలెను. అందువలన వృత్తులు మార్చుకొనుటవలన ప్రయోజనము శూన్యము,"

స్వాములవారు తమకు ఎంతో భక్తి విధేయతలతో సమర్పించిన ఈస్వాగత పత్రములను ప్రశంసించిరి.

స్వాములవారు మిగతా పట్టణములవలె ఒంగోలులో వర్షములుకురవక పోవుటవలన నీరు బొత్తిగా దొరకక పోవుటకు ఎంతో ఆశ్చర్యపడి "శివాలయమునందు శతరుద్రాభిషేకములు జజపి నాలుగవరోజున హోమములు జరిపిన వర్షము కురవగలదు" అనితమ అమూల్యసలహా నొసంగిరి.

స్వాములవారి పీఠపూజ, తదితర కార్యక్రమములు స్థానికన్యాయవాది శ్రీ ఉప్పలపాటి సుబ్రహ్మణ్యం గారి స్వగృహమునందు యేర్పాటుగావింపబడెను. మంగళవారము ప్రొద్దుటి నుంచి వందలాది భక్తులు తిలకించి తీర్థ ప్రసాదములు తీసికొని వెళ్ళిరి.

శ్రీ వరదా నారాయణ రావు (మునిసిపల్ ఛెయిర్మన్) స్వాముల వారికి ఒంగోలు నీటి దుర్భరపరిస్థితుల విషయము సవినయముగా మనవిచేసిరి సమాధానముగా శ్రీ స్వాములవారు పైన పేర్కొనబడినరుద్రాభిషేకముల విషయము తెలియజేసిరి.

తరువాత స్వాములవారు వెళ్ళు సమయమున స్థానిక శివాలయమును తిలకించిరి.

స్వాములవారు యిచ్చటి నుండి నెల్లూరు పట్టణ కార్యక్రమములో పాల్గొనుటకు వెళ్లిరి.

కౌన్సిల్ ప్రశ్నోత్తరాలు:

చేనేత సంఘాలకు ప్రత్యేక బ్యాంకు;

ఆంధ్ర- తెలంగాణాలకు ఒకే సిలబస్ పద్ధతి

హైదరాబాద్, జులై 15

నిన్న శాసనమండలిలో ఒకప్రశ్నకు ముఖ్యమంత్రి శ్రీ డి. సంజీవయ్య సమాధానమిస్తూ తలపెట్టిన ఇండస్ట్రియల్ కార్పొరేషన్ అద్యతన భావిలోనే రిజిస్టరు చేయబడి వెంటనే పని ప్రారంభించునన్నారు. ఈ కంపెనీ రిజిస్ట్రేషన్‌కు కావలసిన నిబంధనలన్నీ సిద్ధము చేయబడి పరిశీలనలో వున్నాయన్నారు.

కేవలము చేనేత సహకార సంఘాలకు మాత్రమే ఆర్థిక సౌకర్యము కలిగించుటకు ఒక సహకార బ్యాంక్‌ను తృతీయ ప్రణాళిక కాలములో స్థాపించుటకు ప్రతిపాదింపబడిదని లఘుపరిశ్రమల మంత్రి శ్రీ కొండా లక్ష్మణ్ తెలియపరచారు. ఈబ్యాంకు సెంట్రల్ బ్యాంక్ ప్రతిపత్తిని కలిగి రాష్ట్రస్థాయిలోనే వ్యవహరించగలదన్నారు. ఈ బ్యాంక్ స్థాపనకు రాష్ట్రప్రభుత్వము 25 లక్షల రూపాయలను మూలధనముగా ఇవ్వగలదని మిగతా 25 లక్షలను సభ్యత్వముగల సహకార సంఘాలు ఇవ్వవలసి వుంటుందన్నారు. ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలకు కలిపి వివిధ విషయాలకు, భాషలకు సంబంధించిన ఒకే సిలబస్‌ను రూపొందించుటకు ఒక సంఘం వేయబడినదని విద్యామంత్రి శ్రీ ఎస్. బి. పి. పట్టాభిరామారావు తెలిపారు. సమన్వయ సిలబస్ పద్ధతి ఈసంవత్సరం మొదటితరగతినుండిఇదివరకే ప్రారంభింపబడినదని, ఇది యేటా ఒక్కొక్క తరగతికి క్రమేణా వర్తింపజేయబడునన్నారు. హైస్కూళ్ళకు, హైయ్యర్ సెకండరీ స్కూళ్ళకు కావలసిన అనుభవము, యోగ్యతగల ఉపాధ్యాయుల కొరత కలదని మరొక ప్రశ్నకుసమాధానమిస్తూ విద్యామంత్రి తెలిపారు.

అయినా రిపైరయ్యే వయః పరిమితిని పెంచబోమన్నారు. తృతీయ పంచవర్ష ప్రణాళికకాలంలో వ్యవసాయోత్పత్తుల లక్ష్యాలను 27.17 టన్నులకు సిద్ధపరచమని ఒక ప్రశ్నకు సమాధానమిస్తూవ్యవసాయ, కార్మికమంత్రి శ్రీ నూకల రామచంద్రారెడ్డి తెలిపారు. మేజర్, మీడియం, నీటి వనరుల ప్రాజెక్టుల నిర్మాణము, మైనర్, ప్రాజెక్టుల నిర్మాణము, భూమిని అభివృద్ధి పరచుట, ఎరువుల సరఫరా, మేలురకం విత్తనాల సరఫరా పంటల రోగనివారణ,అభివృద్ధికరవ్యవసాయ పద్ధతులద్వారా ఆహారధాన్యాల అదనపు ఉత్పత్తులను సాధింప తలపెట్టబడినదన్నారు.

శ్రీ ఎస్. రామకృష్ణయ్య ప్రశ్నకు పబ్లిక్ వర్క్స్ మంత్రి శ్రీ అల్లూరి సత్యనారాయణ రాజు సమాధానమిస్తూ పాలేరు ఆనకట్ట నిర్మాణము, పాలేరు-విట్రగుంట కాలువ త్రవ్వకం పని కొనసాగుచున్నదన్నారు. దీని నుండి క్రిందిచెరువులను నేరుగా నింపకుండా వాటిపైనగలవాటిని దీని పెద్ద తూముద్వారా నింపుటకు మొదటి ప్లానులో రూపొందించబడినదని, కాని అనుభవం దృష్ట్యా ఇదంతభాగా పని చేయదని తెలుసుకొని నేరుగా అన్ని చెరువులకు ఈ పాలేరు చెరువునుండి నీటిని సరఫరా చేయుటకు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలో నిర్ణయము తీసికోబడినదన్నారు. ఈ పని అంతా మూడేండ్ల కాలంలో పూర్తికాగలదన్నారు. ఆదిలాబాద్ జిల్లా, ఆసిఫాబాద్ తాలూకాలో అడవాగు ప్రాజెక్టు నిర్మించే ప్రతిపాదనను ప్రభుత్వము ఆలోచిస్తున్నదని శ్రీ గంగారాం ప్రశ్నకు శ్రీ అల్లూరి సమాధానమిచ్చారు. ఆదిలాబాద్‌లో పెద్దవాగువద్ద వరదలను అదుపులో పెట్టే రిజర్వాయర్‌ను కట్టుటకు సమగ్ర వివరాలు, సర్వేలు పూర్తికావస్తున్నవని ఆయన తెలిపారు. గ్రాంటులు విషయంలోఏడెడ్‌స్కూళ్ళ నిర్వాహకుల ప్రతినిధివర్గ మొకటి ప్రభుత్వాన్ని కలుసుకొన్నదని శ్రీ డి. వి. సుబ్బశాస్త్రి ప్రశ్నకు సమాధానమిస్తూ విద్యామంత్రి తెలిపారు. కళాశాలలకు గ్రాంటులనిచ్చే నిబంధనలను సడలించవలసిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరబడినదని, వారి సమాధానికై ఎదిరిచూస్తున్నామని ఆయన తెలిపారు. ఆస్పత్రులకు మందులు కొనుటకు నిధులను వేరువేరుగా కేటాయించబడలేదని మరో ప్రశ్నకు ఆరోగ్య మంత్రి పఱాస విద్యామంత్రి సమాధానమిచ్చారు.

న్యూయార్క్ ప్రత్తి

న్యూయార్క్, జులై 15

ప్రారంభం	31.	02
ముగింపు	31.	07

రాష్ట్ర వార్తలు

అనంతపురం

ఆంధ్రప్రదేశ్ గవర్నరు శ్రీ భీమసేన్‌సచార్ తమ అనంతపురం జిల్లా పర్యటనసందర్భంలో జులై 8 వ తేదీన ముదిగుబ్బసమితి, కదిరి పంచాయతీ బోర్డు సభ్యుల సమావేశంలో ప్రసంగించారు. సమానమైన, సమర్థవంతమైన పరిపాలనా నిర్వహణకు నియమనిబంధనలు అవశ్యకములని గవర్నరు నొక్కిచెప్పారు. నూతన వ్యవస్థలో అధికార్లు, అనధికార్లమధ్య భేదభావం లేదని ఆయన అన్నారు.

ఆనాడుఉదయం శ్రీసచార్ కదిరి ఉన్నత పాఠశాలలోజరిగిన బ్రహ్మాండమైన బహిరంగసభలోఉపన్యసించారు. అచ్చట ఆయనవిద్యార్థులచేప్రదర్శించబడిన సాంస్కృతిక కార్యక్రమాలను కూడా చూశారు.

తరువాత గవర్నరు కారులో బయలుదేరి అచ్చటికి 16మైళ్ళ దూరములోనున్న కదిరి వెళ్ళిప్రజలను,సమితిసభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు.

గోరంట్ల, పెనుకొండ, మడకశిరలనుకూడా గవర్నరు సందర్శించారు.

శ్రీసచార్ అనంతపురంలోనుండగా గిల్డుఆఫ్ సర్వీసువారిచే నడపబడుతున్న బాలికల గృహాన్ని సందర్శించారు. ఆరోజురాత్రి హరిజనోద్ధరణపై ప్రదర్శించబడిన నాటకాన్ని తిలకించారు. ఈ నాటకరచయిత అయిన శ్రీ ఇజగన్నాథాచారికి ప్రదర్శకులైన "అభ్యుదయకళాసమితి"వారికి స్వర్ణపతకాలు బహూకరించారు.

శ్రీకాకుళం

కలక్టర్ శ్రీవి.పి.రామారావు జులై 11 న జిల్లాలో ప్రణాళికా వారోత్సవాల్ని ప్రారంభించారు. జిల్లా పరిషత్తు ఆధ్వర్యంలో జరిగిన ప్రభాతఫేరీలో సుమారు 2000మంది పిల్లలు పాల్గొన్నారు. సాయంత్రం పరిషత్తు అధ్యక్షుడు శ్రీ బెండి కూర్మన్న అధ్యక్షతన వహించారు.

ఉత్తరవిల్లి, అరికతోటలలో జులై 8న మాధ్యమిక పాఠశాలలకు శ్రీ బెండి కూర్మన్న ప్రారంభోత్సవంచేశారు.

కరీంనగరం

కరీంనగరం జిల్లాలోని వివిధ పాఠశాలలు ప్రణాళికా వారోత్సవాల్ని జరుపుకొన్నవి. ప్రభుత్వ బహుళార్థ సాధక పాఠశాలలో సాయంత్రం బహిరంగసభ జరిగింది. వినోదకార్యక్రమం కూడ జరిగింది.

ఆదిలాబాదు

ఉట్నూరు ప్రాజక్టు సలహా సంఘం గతవారంలో జిల్లాకలక్టర్ శ్రీ వి. శ్రీనివాసాచారి అధ్యక్షతలో సమావేశమై రేడియో రూరల్ ఫోరమున్నగూవాటిని గురించి చర్చ జరిపింది. కలక్టర్ శ్రీ వి. శ్రీనివాసాచారి ప్రసంగిస్తూ ప్రాజక్టు ఉద్యోగులు ఫీల్డు పనిలో తమశక్తిని వినియోగించాలని ఉద్బోధించారు.

అవినీతి నేరాలకు శిక్షలు

ప్రత్యేక పోలీసుశాఖ కృషి ఫలితంగా

హైదరాబాదు, జులై 15

కేంద్రరైల్వేలో గుంటూరుమదుగు రైలుస్టేషనులో పనిచేసిన స్టేషను మాస్టరు బొంబాయిలోని వెస్ట్రన్ ఇండియా కోస్టల్ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్ ప్రతినిధివద్దనుంచి 1959 జనవరి 12 వ తేదీన వేగనులలోసం55 రూపాయలు లంచం అడిగితీసుకున్నందుకు అయన్ను ఉద్యోగంనుంచి తొలగించారని ఇక్కడి ప్రత్యేక పోలీసు సంస్థ తెలియచేసినది.

కాళహస్తిలోని ఒక సెంట్రలు ఎక్సైజు ఇన్సుపెక్టరూ, మరో యిద్దరు ప్రయివేటు వ్యక్తులూ పన్ను చెల్లించని పొగాకు రవాణా చేయడానికి పర్మిట్లు యిచ్చినందుకు 6 నెలల కఠినశిక్ష, 50 రూపాయలు జరిమానా, జరిమానా చెల్లించకప